శుక్రవారం
22-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 270
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పోర్చుగల్ కొత్త ప్రధాని మాంటెనెగ్రో

లిస్బన్: పోర్చుగల్ కొత్త ప్రధానిగా లూయిస్ మాంటెనెగ్రో నియామకం ఖరారైంది. ఆయన పేరును అధ్యక్షుడు మార్సెలో రెబెలో ప్రతిపాదించారు. ప్రతిపక్ష డెమొక్రటిక్ అలయెన్స్ నాయకుడైన మాంటెనెగ్రో బుధవారం అధ్యక్షుడితో సమావేశమయ్యారు. వీరి చర్చలు ముగిసిన తర్వాత నూతన ప్రధానిగా మాంటెనెగ్రో బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వచ్చాయి. ఇదే విషయమై పోర్చుగల్ అధ్యక్ష కార్యాలయం కూడా ఓ ప్రకటన చేసింది. .

కేజ్రీవాల్ అరెస్టు

- ఇంట్లోనే అదుపులోకి తీసుకున్న ఈడీ
- ఆప్ అధినేతను ప్రశ్నిస్తున్న అధికారులు
- పెద్ద ఎత్తున భద్రతా బలగాల మోహరింపు
- భారీగా చేరుకున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు
- సీఎం నివాసం వెలుపల నిషేధాజ్ఞలు
- ఢిల్లీలో ఉద్రిక్తత

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నాయకుల గొంతునొక్కడమే ధ్యేయంగా పెట్టుకున్న కేంద్రంలోని మోదీ సర్కారు సార్వత్రిక ఎన్నికల వేళ దర్యాప్తు సంస్థలతో వేధించే కార్యక్రమాన్ని ముమ్మరం చేసింది. తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు ఢిల్లీలో అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. మొదట కేజ్రీవాల్ నివాసంలో సోదాలు చేపట్టిన అధికారులు... ఆ తర్వాత విచారణ కోసం తమ కార్యాలయానికి రావాలంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చారు. తన నివాసంలోనే విచారించుకోవాల్సిందిగా కేజ్రీవాల్ తేల్చిచెప్పడంతో ఆయన్ను విచారించడం ప్రారంభించారు. రెండుగంటల పాటు ప్రశ్నించిన

- మిగతా 2 లో

తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం అక్షింతలు

డీఎంకే నాయకుడు కె.పొన్ముడికి రాష్ట్ర మంత్రివర్గంలో తిరిగి స్థానం కల్పించే విషయంలో తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి వ్యవహారశైలిని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇదేం పద్ధతి... 24 గంటల్లోగా తేల్చండని ఆదేశాలిచ్చింది.

2లో

కేంద్రం 'ఫ్యాక్ట్ చెక్' యూనిట్‌పై సుప్రీం స్టే

నకిలీ సమాచారాన్ని అడ్డుకునేలా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధ్వర్యంలో కేంద్ర ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించిన అంశమని అభిప్రాయపడింది.

2లో

వికసిత భారత్ సందేశాలు ఆపండి

కేంద్రానికి ఈసీ ఆదేశం

ఎన్నికల వేళ మోదీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. వాట్సప్‌లో 'వికసిత భారత్' సందేశాలను పంపడం వెంటనే ఆపివేయాలని కేంద్రాన్ని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఐటీ మంత్రిత్వ శాఖకు ఆదేశాలు ఇచ్చింది.

2లో

ఈసీల నియామకంపై జోక్యం చేసుకోం

కొత్తచట్టంపై స్టేకు సుప్రీం నిరాకరణ

2లో

'ఇది బీజేపీ కుట్ర'

- డబ్బులేకుండా ప్రచారమెలా సాధ్యం
- రెండు రూపాయలూ ఖర్చు చేయలేకున్నాం
- కాంగ్రెస్‌ను ఆర్థికంగా దెబ్బతీసే రాజకీయ పన్నాగం
- మమ్మల్ని ఎన్నికల్లో పోటీ చేయనిచ్చే ఉద్దేశం మోదీకి లేదా!
- బ్యాంకు ఖాతాల స్తంభనపై సోనియా, ఖర్గే, రాహుల్ ఆగ్రహం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అన్న మాటల్లో ఏ మాత్రం నిజం లేదని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు. ఎన్నికల వేళ ప్రధాన ప్రతిపక్ష పార్టీ చేతిలో చిల్లిగవ్వ లేకుండా చేయడమేనా ప్రజాస్వామ్యం అంటే అని పాలకపక్షాన్ని నిలదీశారు. తమ బ్యాంకు ఖాతాలను ఐటీ అధికారుల ద్వారా స్తంభింపచేయడాన్ని బీజేపీ రాజకీయ కుట్రగా అభివర్ణించారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రధాని మోదీ వ్యూహాత్మకంగా వ్యవహరించారని విమర్శించారు. తమ ఖాతాలను వెంటనే డీఫ్రీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ గురువారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీని ఎన్నికల వేళ

- మిగతా 2 లో

ఎందుకింత నిర్లక్ష్యం?

రాజకీయ హత్యలపై ఈసీ సీరియస్

విచారణకు హాజరైన ప్రకాశం, పల్నాడు, నంద్యాల ఎస్పీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ రాష్ట్ర పోలీస్ అధికారులను ఈసీ ప్రశ్నించింది. అసలు ఏం జరిగిందో ఆయా జిల్లాల బాధ్యులైన ఎస్పీల నుంచి వివరణ కోరింది. గిద్దలూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో జరిగిన రాజకీయ హత్యలు, మాచర్లలో వాహనం తగులబెట్టిన ఘటనలను ఈసీ తీవ్రంగా పరిగణించింది. ఈ మూడు హింసాత్మక ఘటనలపై ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కె.రఘువీరారెడ్డి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా వివరణ తీసుకున్నారు. ముగ్గురు ఎస్పీలు గురువారం

- మిగతా 2 లో

ప్రచార వ్యూహంపై మంతనాలు

అభ్యర్థుల ఎంపికపై చంద్రబాబు, పవన్ చర్చ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ గురువారం మరోసారి భేటీ అయ్యారు. ఎంపీ, మిగిలిన ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి ప్రచార వ్యూహంపై సుమారు గంటపాటు చర్చించుకున్నారు. టీడీపీ రెండు విడతలుగా 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మరో 16 పెండింగులో ఉన్నాయి. అలాగే 17 లోక్‌సభ స్థానాలకు

- మిగతా 2 లో

బీజేపీ, వైసీపీని ఓడించండి

- ఇండియా కూటమి నేతల పిలుపు
- మైండ్‌గేమ్ ఆడుతున్న మోదీ: రామకృష్ణ
- మత చిచ్చుతో మోదీ రాజకీయ లబ్ధి: వైఎస్ షర్మిల
- ఏపీలో మూడు పార్టీలూ తొత్తులే: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని, దానికి మద్దతిస్తున్న వైసీపీని గద్దె దించాలని వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం ఇండియా భాగస్వామ్య, రైతు, కార్మిక, మహిళ, ప్రజాసంఘాల రౌంట్ టేబుల్ సమావేశం జరిగింది. రైతు నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, జై భారత్‌నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నేతలు తులసిరెడ్డి, సుంకర పద్మశ్రీ, మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.

తొలుత వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి 'అప్పుల్లో మొదటి స్థానం...ఆత్మ గౌరవంలో చివరి స్థానం' అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. మరోసారి బీజేపీ అధ్వర్యంలో ఎన్డీఏ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం భావ సారూప్యత గలన రాజకీయ పార్టీలతో పాటు ప్రజా, కార్మిక, మహిళా సంఘాలు ఉమ్మడిగా పోరాటం చేయాలని ఆయన

- మిగతా 2 లో

విశాఖలో డ్రగ్స్ కలకలం

25 వేల కిలోల పట్టివేత

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ తీరంలో డ్రగ్స్ కలకలం రేగింది. అతిపెద్ద ముఠా పట్టుబడింది. ఇది స్థానికంగా అలజడి సృష్టించింది. ఆపరేషన్ గరుడలో భాగంగా అధికారులు చర్యలు చేపట్టి భారీ స్థాయిలో మత్తు పదార్థాలను గుర్తించి, సీజ్ చేశారు. విశాఖలోని ఓ ప్రైవేటు ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌కు బ్రెజిల్ నుంచి వచ్చిన కంటైనర్‌లో 25 వేల కిలోల డ్రగ్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంటర్‌పోల్ సమాచారంతో ఢిల్లీ సీబీఐ విశాఖలోని సీబీఐ, కస్టమ్స్ అధికారులను అప్రమత్తం చేసింది. దీంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 19న నార్కోటిక్స్ సామగ్రి, నిపుణులతో వచ్చిన సీబీఐ... డ్రగ్స్ ఉన్నట్టు నిర్ధారించుకుంది. ఆపరేషన్ గరుడలో భాగంగా అధికారులు వాటిని సీజ్ చేశారు. జర్మనీలోని హ్యాంబర్గ్ మీదుగా ఈనెల 16న కంటైనర్ విశాఖకు వచ్చినట్లు గుర్తించారు. ఓ ప్రైవేటు కంపెనీ 25 కిలోల చొప్పున వెయ్యి సంచుల్లో డ్రగ్స్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

ఇదీ లోకం!

మీటరు సరే? నీళ్లేవీ?

ఏపీ టెట్ ఫలితాలపై ఉత్కంఠ



- ఎన్నికల కమిషన్ చేతుల్లోకి టెట్, డీఎస్సీ
- అనుమతి కోసం విద్యాశాఖ ఎదురు చూపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ విద్యార్హత పరీక్ష (ఏపీ టెట్) 2024 ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. డీఎస్సీ పరీక్షల నిర్వహణ అదే తీరుగా ఉంది. ఎన్నికల షెడ్యూలుకు ముందు రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా ఈ నోటిఫికేషన్ల విడుదలతోనే ఈ దుస్థితి నెలకొంది. దీంతో ఎన్నికల కమిషన్ (ఈసీ) అనుమతి కోసం విద్యాశాఖ ఎదురు చూస్తోంది. టెట్, డీఎస్సీ పరీక్షల మధ్య తక్కువ వ్యవధి ఉండటం, ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లు అనర్హులని హైకోర్టు తేల్చి చెప్పడంతో ఈ రెండు అంశాల ప్రభావం పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులపై పడింది. ఎన్నికల షెడ్యూలు విడుదలకావడంతో ఇప్పుడు టెట్ ఫలితాల విడుదల, డీఎస్సీ నిర్వహణ అంశం ఎన్నికల కమిషన్ చేతుల్లోకి వెళ్లిపోయింది. అక్కడి నుంచి స్పష్టత వచ్చాకే, టెట్ ఫలితాల్ని విడుదల చేస్తామని అధికారులు నొక్కిచెబుతున్నారు.ప్రభుత్వం నాలుగేళ్ల ఎనిమిది నెలల తర్వాత టెట్,

- మిగతా 2 లో

ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో సుబియాంటో ఘన విజయం

2లో

ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో
సుబియాంటో ఘన విజయం

జకార్తా: ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో ప్రబోవో సుబియాంటో ఘన విజయం సాధించారు. ఈ మేరకు ఇండోనేసియా సార్వత్రిక ఎన్నికల సంఘం ప్రకటించింది. అధ్యక్ష ఎన్నికలు ఫిబ్రవరి 14న ముగిశాయి. పోలింగ్ ఆరు గంటల పాటు జరిగింది. ప్రస్తుత రక్షణ మంత్రి సుబియాంటో 38కుగాను 36 ప్రావిన్సుల్లో గెలుపొందారు. సుబియాంటోకు 58.6శాతం ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థులు, జకార్త మాజీ గవర్నర్ అనీస్ బస్వేదాన్‌కు 24.9శాతం, సెంట్రల్ జావా పూర్వ గవర్నర్ గంజర్ ప్రవనోవోకు 16.5శాతం ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు పూర్తైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా, ఫలితాలు ప్రకటించిన మూడు రోజుల్లోగా ఎన్నికల వివాదాలపై రాజ్యాంగ కోర్టులో ఫిర్యాదు చేసేందుకు అవకాశముంటుంది.

జిన్‌పింగ్ శుభాకాంక్షలు

ఇండోనేసియా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన సుబియాంటోకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలిపారు. సుబియాంటో నాయకత్వంలో తమ రెండు దేశాల సంప్రదాయ మిత్ర బంధం మరింత బలోపేతం కాగలదని ఆయన ఆకాంక్షించారు. చైనా-ఇండోనేసియా కమ్యూనిటీ నిర్మాణంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందన్నారు. రెండు దేశాలకు, ప్రజలకు మరింత ప్రయోజనాలు చేకూరేలా, ప్రాంతీయ, ప్రపంచ సుస్థిరత, సుసంపన్నత దిశగా కలిసి పయనిద్దామని తన లేఖలో జిన్‌పింగ్ పేర్కొన్నారు.

వేలానికి సూకీ ఇల్లు... రాని బిడ్‌లు

యాంగాన్: మైన్మార్ ప్రజా నాయకురాలు ఆంగ్ సాన్ సూకీ ఇంటిని అధికారులు వేలం వేయగా ఒక్క బిడ్ కూడా రాలేదు. సోదరుడితో ఆస్తి వివాదం క్రమంలో సూకీ ఇల్లు, స్థలాన్ని అమ్మకానికి పెట్టారు. ఇదే ఇంట్లో 15 సంవత్సరాల పాటు ఆమె గృహ నిర్బంధం ఉన్నారు. 150 మిలియన్ డాలర్ల వద్ద బిడ్డింగ్ మొదలైంది కానీ ఎవరూ బిడ్డింగ్ చేయలేదని అధికారులు వెల్లడించారు. రెండు అంతస్తుల భవనం, 1.9 ఎకరాల స్థలాన్ని వేలానికి పెట్టినట్లు పేర్కొన్నారు. 2010లో గృహ నిర్బంధం నుంచి విడుదలైన సూకీ ఓ విల్లాలో ఉండేవారు.

అయితే 2012లో ఆమె యాంగాన్‌ను వీడారు. వేలం క్రమంలో ఈ ఇంటి వద్దకు అనేకమంది జర్నలిస్టులు చేరుకున్నారు. తాళలు వేసిన తలుపుల వెనుక నుంచి ప్రత్యక్షమైన అధికారులు చిన్న గంటను మూడుసార్లు మోగించి వేలాన్ని ప్రారంభించారు. బిడ్డింగ్‌లు మొదలు పెట్టమని సూచించారు. కానీ ఒక్క బిడ్డు కూడా రాలేదు. మరోసారి గంట మోగించి వేలం ముగిసినట్లు అధికారులు ప్రకటించారు. వార్తాసేకరణకు వచ్చిన జర్నలిస్టుల ఫొటోలను మఫ్టీలో ఉన్న భద్రతా అధికారులు తీశారు.

వియత్నాం ఆపద్ధర్మ అధ్యక్షురాలిగా జువాన్

హనోయ్: వియత్నాం అధ్యక్ష పదవికి వో వాన్ థాంగ్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను వియత్నాం కమ్యూనిస్టు పార్టీ బుధవారం ఆమోదించింది.

దీంతో ఉపాధ్యక్షురాలు వో థి ఆన్ జువాన్‌ను ఆపద్ధర్మ అధ్యక్షురాలిగా వియత్నాం చట్టసభ గురువారం నియమించింది. వియాత్నాం రాజ్యాంగం ప్రకారం నేషనల్ అసెంబ్లీ ద్వారా కొత్త అధ్యక్షుని నియామకం జరిగేంత వరకు ఆపద్ధర్మ అధ్యక్షురాలిగా జువాన్ ఉంటారు. ఆమెకు ఈ పదవి బాధ్యతలను పొలిట్ బ్యూరో కట్టబెట్టింది. వియత్నాం రాజకీయాల్లో రాణించే కొద్దిమంది మహిళా నాయకుల్లో జువాన్ ఒకరు. ఈమె ఏడాదిలో రెండవ సారి అధ్యక్ష బాధ్యతలను

చేపట్టారు.

జువాన్ నియామకాన్ని వియత్నాం ప్రభుత్వం ధ్రువీకరించింది. కాగా, థాంగ్ (54) 2023 మార్చిలో అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. మహమ్మారి కాలంలో జరిగిన కుంభకోణాలకు రాజకీయ బాధ్యత వహిస్తూ న్యూగెన్ జువాన్ ఫుక్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్న రెండు నెలలకు థాంగ్ బాధ్యతలు స్వీకరించారు. వియత్నాంకు పిన్నవయస్సు అధ్యక్షుడిగా నిలిచారు.

ఈసీల నియామకంపై జోక్యం చేసుకోం
కొత్త చట్టంపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముందు ఈసీల నియామకం అంశం తీవ్ర చర్చనీయాంశమైంది. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం నూతనంగా తీసుకొచ్చిన చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. చట్టంపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ దశలో నిలిపివేస్తే అది తీవ్ర గందరగోళానికి, అనిశ్చితికి దారితీస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే దీనిపై ఇప్పుడు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసింది. ఇటీవల ఈసీలుగా బాధ్యతలు చేపట్టిన మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ నియామకాలను ధర్మాసనం ప్రస్తావించింది. కొత్తగా నియమితులైన వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొంది. ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని, అది పాలనాయంత్రాంగం కింద పనిచేస్తుందని చెప్పకూడదని ధర్మాసనం పేర్కొంది. ఈసీల నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టం తప్పు అని భావించలేమని, ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో సమతుల్యత పాటించాల్సిన అవసరం చాలా ముఖ్యమని ధర్మాసనం అభిప్రాయపడింది. కొత్త చట్టం ప్రకారం ఇటీవల చేపట్టిన ఈసీ నియామకాలపై స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టేసింది. ఈసీల నియామకం కోసం సీజేఐతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ 2023లో ఇచ్చిన తీర్పును ధర్మాసనం ప్రస్తావించింది. ఈ అంశంపై పార్లమెంట్ చట్టం చేసే వరకే తాత్కాలిక కమిటీ అమల్లో ఉంటుందని తాము గతంలోనే స్పష్టం చేశామని తెలిపింది. అయితే, కొట్ట చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్లను తాము పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. వీటిపై ఆరు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఏప్రిల్ 5వ తేదీకి వాయిదా వేసింది. 2023 చట్టం రూపొందించక ముందు ఎన్నికల కమిషనర్ల నియామక తాత్కాలిక కమిటీలో ప్రధాని, సీజేఐ, లోక్‌సభలో విపక్షనేత సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టం ప్రకారం ఏర్పడిన కమిటీలో సీజేఐ స్థానంలో కేంద్రమంత్రికి చోటు కల్పించారు. దీన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై కేంద్రం బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. కొత్త చట్టంలో సీజేఐకు చోటు కల్పించకపోవడాన్ని సమర్థించుకుంది. కమిటీలో న్యాయ సభ్యుడు ఉంటేనే ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరిస్తుందన్న వాదన సరికాదని తెలిపింది.

'ఇది బీజేపీ కుట్ర'

(మొదటిపేజీ తరువాయి)

బలహీనపర్చేందుకు మోదీ వ్యూహాలు, కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల వేళ బ్యాంకు ఖాతాలు స్తంభింపచేయడాన్ని ఆక్షేపించారు. ఈ చర్యతో కేవలం కాంగ్రెస్సే కాదు...ప్రజాస్వామ్యం కూడా ప్రభావితమవుతుందని అన్నారు. తమ ఖాతాలను వెంటనే డీఫ్రీజ్ చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల రూపేణ అధికార పక్షం భారీగా విరాళాలు సేకరించిందని ఆరోపించారు. బీజేపీ పాలకులకు రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రత్యక్ష లేక పరోక్ష నియంత్రణ ఉన్నదన్నారు. అభ్యర్థులకు ఇచ్చేందుకు తమ వద్ద డబ్బు లేదని అన్నారు. సమయం చూసి కాంగ్రెస్‌ను దెబ్బతీస్తున్నారని బీజేపీపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

'మేము ప్రచారం ఎలా నిర్వహించాలి. ఎన్నికలకు ఎలా వెళ్లాలి. మా సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఇలా చేశారు' అని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కాంగ్రెస్ పార్టీపై నేరపూరిత చర్య తీసుకున్నారు. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఎలాంటి లావాదేవీలు చేయలేని స్థితికి తెచ్చారు. ప్రచారం కోసం ప్రకటనలు ఇవ్వలేకపోతున్నాం. మా నేతలను ఎక్కడికీ పంపలేకపోతున్నాం. విమానాల్లో కాదు కదా... రైలు టికెట్లు కొనడానికీ డబ్బు లేదు. ఇది కాంగ్రెస్ పార్టీ ఖాతాలు ఫ్రీజ్ చేయడం మాత్రమే కాదు... భారత ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమే అవుతుంది. 20 శాతం ఓటర్లు మాకు మద్దతుగా ఉన్నా... రెండు రూపాయలు కూడా ఖర్చు చేయలేకపోతున్నాం. ఎన్నికల్లో పోరాడకుండా మా సామర్థ్యాన్ని అడ్డుకుంటున్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు' అని రాహుల్ విమర్శల వర్షం కురిపించారు. మీ బ్యాంకు ఖాతాలు స్తంభింపజేస్తే ఏమవుతుంది... ఏటీఎంలు పనిచేయక చేతిలో డబ్బు లేకపోతే మనుగడ సాధ్యమేనా? ప్రస్తుతం కాంగ్రెస్ అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ ఖాతాలను ఫ్రీజ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఫ్రీజ్ చేయడమే అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యమే లేదని, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అన్న వాదన అవాస్తవమని దుయ్యబట్టారు. ప్రజాస్వామిక కార్యాచరణను పరిరక్షించే వ్యవస్థలు కొన్ని ఉంటాయి. కానీ అవి ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయని రాహుల్ అన్నారు.

సోనియాగాంధీ మాట్లాడుతూ తాజా పరిణామం కేవలం కాంగ్రెస్‌ను ఆర్థికంగానే కాదు... ప్రజాస్వామ్యాన్ని కూడా దెబ్బతీస్తుందని, దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తమ ఖాతాల్లోని డబ్బును బలవంతంగా లాగేసుకున్నారని, ప్రధాని వ్యూహాత్మకంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనేక సవాళ్లు ఎదురవుతున్నా ఎన్నికల ప్రచారం సమర్థంగా సాగేందుకు చేయగలిగినదంతా చేస్తున్నామన్నారు. ఓ వైపు ఎన్నికల బాండ్లు... మరోవైపు ప్రతిపక్ష పార్టీలను ఆర్థికంగా దెబ్బతీసే చర్యలు కొనసాగుతున్నాయని సోనియాగాంధీ అన్నారు. లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను డీఫ్రీజ్ చేయించాలని రాజ్యాంగబద్ధ సంస్థలను ఖర్గే కోరారు. బీజేపీ వేల కోట్లలో విరాళాలు తీసుకుని.. తమ ఖాతాలను స్తంభింప చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిష్పాక్షిక ఎన్నికలు తప్పనిసరని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలన్నారు. మోదీ పాలనలో భారతదేశ ప్రతిష్ఠ దిగజారుతోందన్నారు. తమ బ్యాంకు ఖాతాలు స్తంభిపజేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఖర్గే ఆరోపించారు. ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ మాట్లాడుతూ 'మా ఖాతాలు మాత్రమే ఫ్రీజ్ చేయించడం వెనుక మర్మమేమిటి? కాంగ్రెస్ పార్టీకి సామాన్య ప్రజలు ఇచ్చిన విరాళాలను బీజేపీ లూటీ చేసింది. ఎన్నికల బాండ్ల ద్వారా ఎవరు ఎంత లబ్ధి పొందారో ప్రజలకు తెలుసు' అని అన్నారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. పోస్టర్లు వేయించే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు ఖాతాలను ఎందుకు ఫ్రీజ్ చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకూడదనేదే బీజేపీ ఉద్దేశంగా కనిపిస్తోందని ఆరోపించారు.

అథవాలేకు తప్పిన ప్రమాదం

సతారా: కేంద్రమంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధినేత రాందాస్ అథవాలే త్రుటిలో తప్పించుకున్నారు. ఆయన కారు గురువారం ప్రమాదానికి గురైంది. మహారాష్ట్రలోని సతారా జిల్లా వాయ్ నుంచి ముంబైకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో కంటైనర్‌ను అథవాలే కారు ఢీకొన్నట్లు అధికారులు తెలిపారు. కారు బంపర్ దెబ్బతిన్నట్లు వెల్లడించారు. అథవాలేకు గాయాలు కాలేదని, ఆయన సురక్షితంగా తన ముంబై ప్రయాణాన్ని కొనసాగించారని సతారా ఎస్పీ సమీర్ తెలిపారు.

ఏపీ టెట్ ఫలితాలపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నోటిఫికేషన్లను ఏకకాలంలో విడుదల చేసింది. డీఎస్సీ ద్వారా 6,100 పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించారు. తొలుత టెట్, ఆ తర్వాత డీఎస్సీ పరీక్షల షెడ్యూలును వరుసగా విడుదల చేశారు. టెట్, డీఎస్సీకి మధ్య కనీసం వారం రోజుల వ్యవధి కూడా లేకపోవడంపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా, దాంతో టెట్ ఫలితాలు విడుదలైన నెల రోజుల తర్వాతే డీఎస్సీ ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో డీఎస్సీ షెడ్యూలును అనివార్యంగా ప్రభుత్వం పొడిగించాల్సిన అవసరమేర్పడింది. దీనికితోడు ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులంటూ నోటిఫికేషన్‌లో పొందుపరుచగా, దానిపై కూడా ఎస్జీటీ అభ్యర్థులు హైకోర్టులో సవాల్ చేశారు. దీంతో ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వాళ్లు అనర్హులని తేల్చిచెప్పింది. డీఎస్సీ ఎంపికలో టెట్ వెయిటేజీ మార్కులు 20 శాతం కేటాయించడంతో ఈ ఫలితాలు ఎంతో కీలకంగా మారాయి. టెట్ షెడ్యూలు ఆధారంగా ఈనెల 14నే ఫలితాలను విడుదల చేయాల్సి ఉండగా, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఫలితాలను ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

అటు డీఎస్సీ పరీక్షల నిర్వహణపైనా స్పష్టత లేదు. ఇప్పటికే అభ్యర్థుల నుంచి పెద్దఎత్తున దరఖాస్తులను స్వీకరించారు. మూడు లక్షల మందికిపైగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి వివిధ ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లలో శిక్షణ పొందుతున్నారు. డీఎస్సీకి దరఖాస్తులను స్వీకరించి, పరీక్షా కేంద్రాల ఎంపికపై ఇంతవరకు వెబ్‌సైట్‌లో స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఎన్నికల్లోగా డీఎస్సీ జరుగుతుందా లేదా అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. అతి తక్కువ పోస్టులతో ప్రకటించిన 6,100 డీఎస్సీ పోస్టులను రద్దు చేసి, ఎన్నికల తర్వాత మెగా డీఎస్సీ ఇవ్వాలని విపక్షాలు, యువజన, నిరుద్యోగ సంఘాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. కేవలం ఎన్నికల్లో నిరుద్యోగుల ఓట్ల నుంచి లబ్ధి పొందేందుకే ప్రభుత్వం హడావుడిగా టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చిందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ తీరు వల్ల తాము శిక్షణ కోసం సమయం, ఆర్థికంగా డబ్బులు వెచ్చించి నష్టపోయామని నిరుద్యోగులు వాపోతున్నారు. టెట్ ఫలితాలు, డీఎస్సీ పరీక్షల నిర్వహణ ఎన్నికల కమిషన్ చేతుల్లోకి వెళ్లిపోవడంతో వారికి దిక్కుతోచడం లేదు. ఇప్పటికే 2018 గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షల వివాదం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో ఎట్టకేలకు హైకోర్టును ఏపీపీఎస్సీ, ప్రభుత్వం ఆశ్రయించగా తాత్కాలిక ఊరట లభించింది. గ్రూప్ -1 మెయిన్స్ వివాదం నుంచి కాస్త ఊపిరి పీల్చుకున్న ప్రభుత్వానికి, తాజాగా టెట్, డీఎస్సీ పరీక్షల వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారింది.

ప్రచార వ్యూహంపై మంతనాలు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. పెండింగులో ఉన్న శాసనసభ స్థానాలు, ఎంపీ అభ్యర్థులను నేడో రేపో వెల్లడించే అవకాశముంది. చంద్రబాబు ఈనెల 26 నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. 27వ తేదీ నుంచి వారాహి యాత్రతో ప్రచారాన్ని ప్రారంభించేలా పవన్ కల్యాణ్ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 21 అసెంబ్లీ సీట్లకుగాను ఐదు స్థానాలకు అధికారికంగా, మరో 6 స్థానాలకు అనధికారికంగా అభ్యర్థులను ఖరారు చేశారు. మిగిలిన స్థానాలకు, రెండు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. బీజేపీకి కేటాయించిన ఆరు ఎంపీ, 10 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. బీజేపీ తరపున ఏ స్థానం నుంచి ఎవరు పోటీ చేయబోతున్నారు... ఖరారైన అభ్యర్థులెవరు... తదితరాంశాలపైనా చంద్రబాబు, పవన్ చర్చించినట్లు తెలిసింది.

99 శాతం హామీల అమలు బూటకం: చంద్రబాబు

విధ్వంసాలకు, కక్షా రాజకీయాలకు, దోపిడీకి ఐదేళ్ల పదవీ కాలాన్ని వెచ్చించిన ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి అని చంద్రబాబు 'ఎక్స్'లో విమర్శించారు. 99 శాతం హామీల అమలు చేశామనే జగన్ మాట బూటకం...విశ్వసనీయతపై అతని కబుర్లు అతిపెద్ద నాటకం! అని వ్యాఖ్యానించారు. ప్రజలను మరోమారు మోసం చేయడానికి జగన్ సిద్ధమయ్యారని, గత హామీలపై బదులిచ్చాకే బస్సెక్కాలంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

బీజేపీ, వైసీపీని ఓడించండి

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు ఇతర విభజన హామీలన్నీ అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

షర్మిలారెడ్డి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయన్నారు. మతం పేరుతో చిచ్చు రేపుతూ ఆ మంటల్లో బీజేపీ నేతలు చలి కాగుతున్నారని మండిపడ్డారు. దేశాభివృద్ధి కోసం గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం చేసిన మంచి పని ఒక్కటీ లేదన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మతాలు, కులాలు, ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టి లబ్ధి పొందుతున్నారని, గోద్రా, మణిపూర్ లాంటి ఘటనలే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అటువంటి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. ఏపీకి తలమానికమైన విశాఖ ఉక్కును సైతం కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడ్డారని, ఎక్కువ ఎంపీలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తానని ప్రజలను నమ్మించి... ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అందువల్ల అందరూ ఐక్యంగా పోరాడి బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను గద్దె దించాలని పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తమకు 370 నుంచి 400 ఎంపీ సీట్లు వస్తాయని మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. గత పదేళ్లలో ఈ దేశానికి ఏం చేశారని మళ్లీ మోదీని గెలిపిస్తారని ప్రశ్నించారు. రైతు, నిరుద్యోగ, మహిళా సమస్యలు, బ్లాక్ మనీ సమస్యలపై నోరు మెదపని మోదీ... 2014లో ఇచ్చిన హామీలపై ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీలను భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్, చంద్రబాబు కూడా భయపడే మోదీకి మద్దతు ఇస్తున్నారని, ఇక్కడ వైసీపీ, టీడీపీ, జనసేనల్లో ఏ పార్టీకి ఓటు వేసినా అది బీజేపీకి వేసినట్లేనని ప్రజలు గుర్తించాలని కోరారు. ఏపీకి తీరని అన్యాయం చేసిన బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని, వారు పోటీ చేసే ఆరు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయంగా తాకట్టు పెట్టిన ఘనత చంద్రబాబు, జగన్‌కే దక్కుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ తాజాగా పాల్గొన్న బహిరంగ సభలోనూ చంద్రబాబుకు ఓటేయాలని, జగన్‌ను గద్దె దించాలని ఎక్కడా చెప్పలేదని విమర్శించారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీకి తొత్తులుగా మారాయని, అటువంటి మూడు పార్టీలను బలపరచడానికి తెలుగు ప్రజలు సిగ్గు పడాలన్నారు.

లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ అధిక ధరలతో పేదలు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి శత్రువు అయిన బీజేపీ, దాని మిత్రపక్షాలు, వైసీపీలపై ఉమ్మడిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలో జరుగుతున్న కీలక పరిణామాలను ఇండియా భాగస్వామ్య పక్షాలు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన పిలుపు నిచ్చారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీతో పాటు దాని భాగస్వామ్య పక్షం అయిన ఎన్డీఏలోని పార్టీలను ఓడించకపోతే దేశం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. దేశంలోని 50 శాతం కంటే ఎక్కువ ప్రజలు ఇండియా భాగస్వామ్య పక్షాలతోనే ఉన్నారని, వీరంతా ఐక్యంగా మోదీని గద్దె దించేవరకు పోరాడాలన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి యుద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, ప్రముఖ ఇంజనీర్ కేవీఎల్ రావు కుమారుడు విజయరావుతో పాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల సభ్యులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

కేజ్రీవాల్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం చివరకు ఇంట్లోనే ఆయన్ను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. గురువారం రాత్రి ఏ సమయంలోనైనా కేజ్రీవాల్‌ను ఈడీ కార్యాలయానికి తరలించనున్నారు. శుక్రవారం ఆయన్ను దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరుస్తారని తెలిసింది. సీఎం నివాసానికి ఈడీ అధికారులు వచ్చారని తెలుసుకున్న ఆప్ శ్రేణులు పెద్దసంఖ్యలో ఆయన నివాసం వద్దకు చేరుకుని ఆందోళన ప్రారంభించడంతో దిల్లీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నాటకీయ పరిణామాలు

దిల్లీ మద్యం కుంభకోణం కేసులో తనను అరెస్ట్ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలన్న సీఎం కేజ్రీవాల్ విజ్ఞప్తిని దిల్లీ హైకోర్టు తోసిపుచ్చిన వెంటనే పరిణామాలు వేగంగా మారిపోయాయి. గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో 12 మంది ఈడీ అధికారుల బృందం సీఎం కేజ్రీవాల్ నివాసానికి చేరుకుంది. వారిని ప్రశ్నించిన కేజ్రీవాల్ భద్రతా సిబ్బందికి సెర్చ్ వారెంట్‌తో వచ్చినట్లు తెలిపిన ఈడీ అధికారులు ఇంట్లోకి వెళ్లి సోదాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ నివాసానికి దారితీసే అన్ని దారుల్ని మూసివేశారు. 144 సెక్షన్ విధించారు. కొంతసేపటి తర్వాత వచ్చిన మరో ఈడీ బృందం కేజ్రీవాల్‌ను విచారణకు ఈడీ కార్యాలయానికి రావాల్సిందిగా కోరారు. తాను రానని... ఇక్కడే విచారణ చేసుకోవాలని కేజ్రీవాల్ చెప్పడంతో ఆయన నివాసంలోనే పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 50 కింద ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. కేజ్రీవాల్ సెల్‌ఫోన్‌ను ఈడీ అధికారులు స్వాధీనపర్చుకున్నారు. ఈ స్థితిలో ఏ క్షణంలోనైనా కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేస్తారన్న వార్తలు జోరందుకున్నాయి. సీఎం ఇంటివద్ద భారీగా పోలీసులు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఎం నివాసానికి ఆప్ నేతలు, పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు తరలివచ్చి నిరసన తెలిపారు. మోదీ నిరంకుశత్వం నశించాలని నినాదాలు చేశారు. 'పోలీసులు లోపలికి వెళ్లడం, ఎవరినీ లోపలికి అనుమతించకపోవడాన్ని బట్టి చూస్తుంటే సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని వారు ప్లాన్ చేసినట్లు అర్థమవుతోంది. ప్రజలంతా కేజ్రీవాల్‌కు అండగా ఉంటారు' అని దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. కాగా కేజ్రీవాల్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు జరపడాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ తీవ్రంగా ఖండించారు.

కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయరు: స్పీకర్

కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి కొన్ని నిమిషాల ముందు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసినా ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయరని తెలిపారు. ఎన్నికలకు ముందు ఆయన గొంతు నొక్కేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆయనను అరెస్ట్ చేస్తే జైలు నుంచి దిల్లీని పరిపాలన చేస్తారని సాయంత్రమే చెప్పారు.

హైకోర్టులో లభించని ఊరట...సుప్రీంను ఆశ్రయించిన కేజ్రీవాల్

మరోవైపు, మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు దిల్లీ హైకోర్టులో గురువారం ఊరట లభించలేదు. ఈ కేసులో ఆయనకు అరెస్టు నుంచి మినహాయింపు కల్పించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుతం ఈ కేసు పురోగతి దృష్ట్యా ఇందులో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పిన నేపథ్యంలో వెంటనే ఈడీ అధికారులు కేజ్రీవాల్ ఇంటికి రావడంతో ఆయన్ను అరెస్టు చేస్తారేమోనన్న వార్తలు కలకలం రేపాయి. కాగా దిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ... కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మద్యం విధానం కేసులో మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ ఆదేశాలిచ్చేందుకు దిల్లీ హైకోర్టు నిరాకరించడాన్ని ఆయన న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ అంశాన్ని అత్యవసర జాబితాలో చేర్చి విచారణ జరిపించేందుకు లీగల్ టీమ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాగా కేజ్రీవాల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగే అవకాశం ఉంది. మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ఇప్పటికే తొమ్మిది సార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ హాజరయ్యేందుకు నిరాకరించారు. ఈ కేసులో ఇప్పటికే సీబీఐ కేజ్రీవాల్‌ను విచారించింది. గతేడాది ఏప్రిల్‌లో 9 గంటల పాటు ప్రశ్నించారు.

తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం అక్షింతలు

న్యూదిల్లీ: డీఎంకే నాయకుడు కె.పొన్ముడికి రాష్ట్ర మంత్రివర్గంలో తిరిగి స్థానం కల్పించే విషయంలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహారశైలిని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇదేం పద్ధతి... 24 గంటల్లోగా తేల్చండని ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టును రవి ధిక్కరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సిఫార్సు చేసినాగానీ పొన్ముడికి తిరిగి మంత్రి పదవి ఇచ్చేందుకు రవి నిరాకరించడంపై సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. పోన్‌ముడికి మంత్రి పదవి తిరిగివ్వడాన్ని రాజ్యాంగ నైతికతకు విరుద్ధమైనది గవర్నర్ ఎలా చెప్పగలరని ప్రశ్నించింది. అక్రమాస్తుల కేసులో పొన్ముడికి మూడేళ్ల శిక్షపై స్టే విధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పునిచ్చింది. ఇదే క్రమంలో ఆయనకు మంత్రి పదవిని తిరిగి ఇవ్వాలని సీఎం సిఫార్సు చేసినా గవర్నర్ ఒప్పుకోలేదు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 'మిస్టర్ అటార్నీ జనరల్, గవర్నర్ తీరు మమ్మల్ని ఆందోళనకు గురిచేస్తోంది. కోర్టులో ఈ విధంగా ఆక్షేపించాలని అనుకోలేదు కానీ ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ధిక్కరిస్తున్నారు. ఆయనకు సలహాలిచ్చిన వారెవరూ సరైన సలహా ఇవ్వలేదు. సుప్రీంకోర్టు ఎవరి శిక్షనైనా ఆపేస్తే అది ఆగిపోతుందని గవర్నర్‌కు అర్థమయ్యేలా చెప్పండి. రేపటిలోగా మీ నుంచి వ్యక్తిగత వివరణ రాకపోతే రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని గవర్నర్‌ను ఆదేశించాల్సి ఉంటుంది. మేము అలాగే తీర్పు ఇస్తాం' అని వెల్లడించింది.

కేంద్రం 'ఫ్యాక్ట్ చెక్' యూనిట్‌పై సుప్రీం స్టే

న్యూదిల్లీ: నకిలీ సమాచారాన్ని అడ్డుకునేలా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధ్వర్యంలో కేంద్ర ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌పై సుప్రీంకోర్టు గురువారం స్టే విధించింది. ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించిన అంశమని అభిప్రాయపడింది. ఆన్‌లైన్ కంటెంట్‌లో నకిలీ, తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకుగాను ఫ్యాక్ట్‌చెక్ యూనిట్ తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం గతేడాది ఏప్రిల్‌లో పేర్కొంది. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021కు సవరణలు చేసింది. అయితే, ఈ కొత్త నిబంధనలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే ఐటీ నిబంధనల చెల్లుబాటును సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తదితరులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం... ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఏర్పాటుపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. బాంబే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం మార్చి 11 నాటి హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది. ఈ యూనిట్ ఏర్పాటుపై హైకోర్టు ముందుకొచ్చిన ప్రశ్నలను పరిశీలించాల్సిన అవసరం ఉందని, అప్పటివరకు కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే విధిస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది.

వికసిత భారత్ సందేశాలు ఆపండి

న్యూదిల్లీ: ఎన్నికల వేళ మోదీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. వాట్సప్‌లో 'వికసిత భారత్' సందేశాలను పంపడం వెంటనే ఆపివేయాలని కేంద్రాన్ని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఐటీ మంత్రిత్వ శాఖకు ఆదేశాలు ఇచ్చింది. ఈ అంశంపై ఫిర్యాదులు అందడంతో ఈసీ చర్యలు తీసుకుంది. పారదర్శకతను నిర్ధారించేందుకు తాము తీసుకుంటున్న చర్యలో ఇదొక భాగమని ఎన్నికల సంఘం వెల్లడించింది. కొద్దిగంటల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుందనగా ప్రధాని మోదీ లేఖతో ఉన్న వాట్సప్ సందేశాలను కేంద్రం పంపింది. 'వికసిత భారత్ సంపర్క్' పేరిట అవి వస్తున్నాయి. నెట్‌వర్క్ పరిమితుల కారణంగా మార్చి 16న పంపిన సందేశాలు కొందరికి ఆలస్యంగా డెలివరీ అవుతున్నాయని ఈసీకి ఐటీ శాఖ వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసే మెసేజ్‌లు వస్తున్నాయని ఈసీకి ఫిర్యాదులు అందాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని కోరాయి.

ఎందుకింత నిర్లక్ష్యం?

(మొదటిపేజీ తరువాయి)

సీఈవో మీనా ఎదుట హాజరుకాగా... ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరించారని, రాజకీయ హత్యల దాకా పరిస్థితులు దిగజారే వరకు ఎందుకు వేచి చూడాల్సి వచ్చిందని ఆయన ఎస్పీలను నిలదీసినట్లు తెలిసింది. మాచర్ల నియోజకవర్గం చాలా కాలంగా సున్నిత ప్రాంతాల జాబితాలో ఉన్నప్పటికీ ఎందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారని పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత హెచ్చరికలు జారీ చేసినా... దానికనుగుణంగా చర్యలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది.కాగా ముగ్గురు ఎస్పీలు ఇచ్చిన వివరణల నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. ఇటీవల చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధ్వర్యాన భారీ బహిరంగసభ నిర్వహించగా... దానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ బహిరంగసభకు భద్రతా ఏర్పాట్ల విషయంలో కూడా ఈ ముగ్గురు ఎస్పీలు బాధ్యతారహితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కూటమి నేతలు ఎన్నికల సంఘ ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

విగ్రహాలు, స్థూపాలు సరే...

ఇంటి పట్టాలపై ఫొటోల సంగతేంటి?

ఈసీ నిబంధనలపై ప్రజల ప్రశ్న

విశాలాంధ్ర-డిజిటల్: 'కోడ్' కూసింది... ముసుగు తొడిగింది. ఎన్నికల కోడ్ అమలైన రోజు నుంచే అధికారుల ఆదేశాలతో సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కనిపించిన ప్రతి విగ్రహానికి ముసుగు తొడుగుతున్నారు. ఎన్నికల నిబంధనావళి పేరుతో దివంగత నేతల విగ్రహాలను సైతం గుడ్డ లేదా ప్లాస్టిక్ షీట్‌తో చుట్టేస్తున్నారు. విగ్రహాలు, స్థూపాలు సరే... ప్రజలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు, పిల్లల పుస్తకాలు, రేషన్‌కార్డులు వంటి అనేక వాటిపై పాలకులు తమ ఫొటోలు ముద్రించుకున్నారు. వాటిని ఏమి చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆశ్చర్యం కలిగించే విషయమేమి టంటే... సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేసి తమ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేతల గౌరవ సూచికంగా పేదలు నిర్మించుకున్న అమరవీరుల స్థూపాలకు సైతం ముసుగు వేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ సజీవంగా ప్రజాక్షేత్రంలో తిరుగాడే నేతల విగ్రహాలకు మాత్రమే భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముసుగు వేయాల్సి ఉండగా, ప్రజాసేవ చేస్తూ దశాబ్దాల క్రితమే దివికేగిన మహోన్నత రాజకీయ నేతల ప్రతిరూపాన్ని విగ్రహాలుగా అనేక కూడళ్లలో ఏర్పాటు చేసుకుంటే... వాటికి కూడా

ఎన్నికల కోడ్ అంటూ ముసుగేయడాన్ని సీనియర్ సిటిజన్లు తప్పుపడుతున్నారు. విగ్రహాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని భ్రమపడడం అమాయకత్వమేనంటున్నారు. ఆ రోజులు ఏనాడో గతించాయని, ప్రజలతో మమేకమై, అన్ని వర్గాల వారిని అభివృద్ధి పథంలో నడిపించే నాయకుడి కోసమే ఓటర్లు ఎదురు చూస్తారు తప్ప విగ్రహాలు చూస్తూ

ప్రభావితమై ఓట్లు వేయరన్న సంగతి అధికారులు, సిబ్బంది గుర్తించకపోవడం అవగాహనా రాహిత్యమేనంటున్నారు. రాజ్యాంగంలో ఎక్కడా దివంగత నేతల విగ్రహాలకు సైతం ముసుగువేసి ఎన్నికలు నిర్వహించాలని చెప్పలేదని, ఎన్నికల కమిషనర్లు సజీవంగా ప్రజాక్షేత్రంలో తిరుగాడే నేతల విగ్రహాలకు మాత్రమే మాస్క్ వేయాలని స్పష్టంగా చెబుతున్నా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టుగానే ఉందంటున్నారు. భారత రాజ్యాంగంలోని 15వ భాగంలో 'ఎన్నికలు' అనే పదం ఉపయోగించబడిందని, ఆర్టికల్ 324 'ఎన్నికల ప్రవర్తన' అనే వ్యక్తీకరణ విస్తృతమైన అర్థాన్ని సూచిస్తూ ఎలా అదుపు చేయాలో చెబుతుంది. భారతీయ శిక్షాస్మృతిలోని 171ఏ ఎన్నికల్లో ఓ వ్యక్తి నిలబడడానికి గల అర్హతలు, అభ్యర్థులు వైదొలగడానికి, ఓటు హక్కు వినియోగించుకోవడానికి హక్కుగా నిర్వచిస్తుంది. ప్రజాస్వామ్య మనుగడ సాగాలంటే చట్టబద్ధ పాలన ఉండడానికి నిబంధనలు తప్పకుండా పాటించాలి. కానీ కనిపించిన ప్రతి విగ్రహానికి ముఖం కనిపించకుండా కొన్నింటికి, మరికొన్నింటికి పూర్తిగా గుడ్డ చుట్టేయడం ఏ చట్టం చెబుతుందో అర్థం కావడం లేదంటున్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెప్పడం ముదావహం. ఆశ్చర్య మేమంటే గ్రామసీమల్లో రచ్చబండలుగా ఏర్పాటు చేసుకున్న బల్లలను తెల్లరంగులతో నింపుతున్నారు. కొన్నింటిని ప్రజలకు కనిపించకుండా పక్కన పెడుతు న్నారు. కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల సమాధులు, స్మృతి చిహ్నాలకు సైతం ముసుగేస్తున్నారు. రోడ్లు, భవనాల ప్రారంభోత్సవాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు గుడ్డలు కప్పుతున్నారు.

ధాన్యం రైతు బకాయిలు చెల్లించండి

సీఎస్ జవహర్ రెడ్డికి కేవీవీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ధాన్యం రైతుల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ గురువారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్‌కు సంబంధించిన వరి ధాన్యం అమ్మిన రైతుల బకాయిలు రెండు నెలలకుపైగా నిలిచిపోయాయి. జనవరి 18వ తేదీ నుండి బకాయిల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఇంకా కొన్నిప్రాంతాల్లో ధాన్యం నూర్పిళ్లు జరగాల్సి ఉన్నది. మినుము, మొక్కజొన్న తదితర పంటలు చేతికి అందివచ్చాయి. కోతలు, నూర్పిళ్లకు అవసరమైన పెట్టుబడులు అందక రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కరువు, తుపానులలో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా అందలేదు. ధాన్యం అమ్ముకున్న రైతులు ప్రభుత్వం పైకం ఎప్పుడు చెల్లిస్తుందా అని ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున పైకం సకాలంలో అందుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రెండు నెలలుగా ధాన్యం బకాయిల చెల్లింపులో తీవ్రజాప్యం కావడంతో రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం లేదు. నేరుగా ప్రైవేటు వ్యాపారులకు, రైస్ మిల్లర్లకు తక్కువ ధరకే ధాన్యం అమ్మి నష్టపోతున్నారు. రైతులు చేసిన అప్పులకు వడ్డీల చెల్లింపు భారంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే జోక్యం చేసుకొని ధాన్యం బకాయిలు, ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

మట్టి ఖర్చుల పెంపుపై ఈయూ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీలో విశ్రాంత ఉద్యోగులు చనిపోతే ఇప్పటి వరకు చెల్లిస్తున్న రూ.15 వేల మట్టి ఖర్చులను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో రూ.25 వేలకు పెంచేందుకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు హామీ ఇవ్వడంపై ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలు త్వరలోనే జారీ చేస్తామని హామీ ఇచ్చిన ఎండీకి ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో గురువారం వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలతో ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల సమావేశం నిర్వహించారు. కడప జిల్లాలో పార్టీ స్థితిగతులపై నేతలను షర్మిల అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే తనతోపాటు ఎవరైనా ఎక్కడైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని షర్మిల ఆదేశించారు. తానైనా, ముఖ్యనేతలైనా పార్టీ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ నేతలు ఎలాంటి కలలు కంటున్నారో చూడాలని వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను కాంగ్రెస్ పార్టీ అడ్డుకొని తీరుతుందని షర్మిల స్పష్టంచేశారు. కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎంపీగా ఉన్న అవినాశ్‌రెడ్డి ఎందుకు పోరాటం చేయలేదని సూటిగా ప్రశ్నించారు. సమావేశానికి కాంగ్రెస్ నాయకులు తులసిరెడ్డితోపాటు వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఇండియా కూటమి, దాని భాగస్వామ్య పార్టీలతో కలసి పోటీకి దిగేందుకు కాంగ్రెస్ ఒక అవగాహనకు వచ్చింది.

ప్రగతిశీల పార్టీల విజయంతోనే దేశ పురోగతి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ 'ఇండియా' కూటమితో కలిసి పని చేస్తుందని, ఈ విషయమై కార్యకర్తలు, నాయకులు అవగాహన కలిగి ఉండాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం వేలూరులో బుధవారం రాత్రి పార్టీ గ్రామ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రగతిశీల పార్టీల విజయంతోనే దేశ పురోగతి ఆధారపడి ఉంటుందని వివరించారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యల సాధన కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, చిలకలూరిపేట ఏరియా ఇన్‌ఛార్జ్ కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కందిమల్ల వెంకటేశ్వరరావు, భగత్ సింగ్ పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న పార్టీ సీనియర్ నేత కందిమల్ల సాంబయ్యను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పవన్ కల్యాణ్‌ను నమ్మకండి

గాజువాక, భీమవరం ప్రజల బహిరంగ లేఖ

జనసేన సీట్లలో రచ్చ: విజయవాడ వెస్ట్‌లో రెబెల్‌గా పోతిన!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను నమ్మొద్దంటూ పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు గాజువాక, భీమవరం ప్రాంత ప్రజలు సోషల్ మీడియా వేదికగా బహిరంగ లేఖ రాశారు. పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి అసెంబ్లీగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించిన క్రమంలో ఈ లేఖ చర్చనీయాంశంగా మారింది. 2019 ఎన్నికల్లో గాజువాక, భీమవరం నుంచి పవన్ కల్యాణ్ పోటీ చేసి, రెండు చోట్లా ఓడిపోయారు. అప్పట్లో గాజువాక, భీమవరంలలో తన సామాజిక వర్గం ఓట్లు అత్యధికంగా ఉన్నందున, తప్పకుండా గెలుపు ఖాయమన్న ధీమాతో ఆయన ఎన్నికల బరిలో దిగారు. ఓటమి పాలయ్యాక పవన్ ఎప్పుడూ ఆ రెండు నియోజకవర్గాల వైపు కన్నెత్తి చూడలేదు. అక్కడ సమస్యలపై స్పందించలేదు. రాబోయే ఎన్నికల్లోనే మళ్లీ పవన్ సామాజికవర్గం ఓట్లు అత్యధికంగా ఉన్న పిఠాపురంలో పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో పిఠాపురంలోని మిగిలిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలను ఏకం చేసేలా వైసీపీ ప్రణాళిక రచిస్తోంది. ఇంతలో సోషల్ మీడియా వేదికగా పవన్‌కు బహిరంగ లేఖ రాయడం జనసేన శ్రేణులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పటికే పిఠాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ పవన్‌కు మద్దతు ఇస్తానంటూనే... ఆయన ఏ క్షణంలోనైనా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు పవన్ కల్యాణ్‌ను నమ్మవద్దంటూ గాజువాక, భీమవరం ప్రజలు బహిరంగ లేఖ రాశారు. తమ ప్రాంత సమస్యలపై పవన్ ఏ నాడూ స్పందించలేదని, పర్యటనలు చేయలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆయన గాజువాక, భీమవరంలలో స్థానికంగా నివసించలేదని తెలిపారు.

అటు రాష్ట్ర వ్యాప్తంగా అరకొరగా ప్రకటించిన జనసేన సీట్లలో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ జనసేన సీటును బీజేపీకి కేటాయిస్తారన్న ప్రచారంతో అక్కడి జనసేన ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేశ్, ఆయన అనుచరులు ఆందోళనబాట పట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విజయవాడ వెస్ట్ సీటును జనసేనకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రెబల్ అభ్యర్థిగా బరిలో దిగుతానని పోతిన వెంకట మహేశ్ ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెస్ట్ తనదేనని నొక్కిచెప్పారు. తాజాగా విజయవాడ వెస్ట్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేతలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీంతో పోతిన అనుచరులు రంగంలోకి దిగి, పవన్ తీరును తప్పుపట్టారు. పొత్తు ధర్మంలో భాగంగా బీజేపీకి సెంట్రల్ సీటు ఇచ్చి... అక్కడ వైసీపీ తరపున పోటీలో ఉన్న వెలంపల్లి శ్రీనివాస్‌ను ఓడించాలంటూ సూచించారు. పవన్ నుంచి తమకు సానుకూల నిర్ణయం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటు రాజోలు తదితర నియోజకవర్గాల్లో జనసేన టికెట్లు లభించని జనసేన నేతలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణగిరి ఎస్ఐని తొలగించాలి

రామచంద్రయ్య డిమాండ్

విశాలాంధ్ర-కర్నూలు: అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎన్నికల కంట్రోల్ రూమ్ సూపరింటెండెంట్‌కు ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం సోత్రంఎర్రగుడికి చెందిన సీపీఐ నాయకుడు చాకలి నరసింహుడును ఈ నెల 17న స్టేషన్‌కు పిలిపించి వైసీపీలో చేరాలని బెదిరించి లాఠీతో కొట్టి అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఇదే స్టేషన్‌లో గతంలో పనిచేసిన ఈ ఎస్ఐను ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాడన్న నమ్మకంతో రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో తిరిగి ఇక్కడికి బదిలీ చేశారన్నారు. ఎస్ఐగా చంద్రశేఖర్ రెడ్డి ఉంటే మండలంలో ఎన్నికలు సక్రమంగా జరగవని ఘంటాపథంగా చెప్పారు. అధికార పార్టీకి స్టేషన్ అడ్డాగా మారిందన్నారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎస్ఐపై సస్పెండ్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు కారన్న, రవిమోహన్, నాగరాజు, సంజీవుడు, రామాంజనేయులు, పరమేశ్వరరెడ్డి, కత్తి సుంకన్న ఉన్నారు.

తాగునీటి కోసం రూ.115 కోట్లు

కుళాయిల ద్వారా రోజుకు ఒకసారైనా నీరు: సీఎస్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వేసవి నీటి ఎద్దడిని అధిగమించేందుకు రూ.115 కోట్ల అంచనాతో సిద్ధం చేసిన వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకోవాలని సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీటి పరిస్థితులపై గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఆయన పంచాయతీరాజ్, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా, మున్సిపల్ నీటి సరఫరా విభాగాల అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో మంచినీటి సరఫరా పరిస్థితులపై సమీక్షిస్తూ జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. నిర్మాణం పూర్తి కావచ్చిన మంచినీటి పథకాలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. వివిధ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులలను పూర్తిగా నీటితో నింపాలని, పెండింగ్‌లో ఉన్న వివిధ తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బోర్‌వెల్స్ సహా ఇతర మంచినీటి వనరులకు అవసరమైన మరమ్మతులు నిర్వహించి సమక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్నమూడు మాసాలు

వివిధ మంచినీటి సరఫరా పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మంచినీటి ఎద్దడి గల ఆవాసాలు, శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు మంచినీటి సరఫరా చేసేలా, మంచినీటి కుళాయిల ద్వారా రోజుకు ఒకసారైనా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడైనా మంచినీటికి ఇబ్బంది కలిగితే 1904 కాల్ సెంటర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, పశువులకు కూడా తాగునీటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ కమిషనర్ శ్రీకేశ్ బాలాజీ రావు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, కేవీవీ సత్యనారాయణ, ఆర్‌వీ కృష్ణారెడ్డి, ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారి ఆనంద రావు తదితరులు పాల్గొన్నారు.



నేడు లాసెట్-2024 నోటిఫికేషన్

విశాలాంధ్ర-గుంటూరు: ఏపీ లాసెట్-2024 (లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ లాసెట్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించి ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 25లోగా అపరాధ రుసుం లేకుండా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఎవ్ం.ఖజుంఎవ్రవ.ఖజూ.స్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 79937 88813, 0863-2346171 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. వీసీ, ఏపీ లాసెట్ చైర్మన్ ఆచార్య పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, ఆచార్య సంధ్యాకోల్, ఆచార్య జి.నాగరాజు, కె.బాల మురళి ఉన్నారు.

సీఎం జగన్‌తో పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు భేటీ

వంగా గీత విజయానికి కృషి చేయాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంపై వైసీపీ వ్యూహాల పరంపర కొనసాగిస్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా బరిలోకి దిగడంతో ఆ స్థానంపై పూర్తి స్థాయిలో వైసీపీ దృష్టి పెట్టింది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఇటీవల సీఎం జగన్‌ను ఆ ప్రాంతానికి చెందిన ముద్రగడ పద్మనాభం, కాకినాడ ఎంపీ వంగా గీత కలిశారు. ఈ సందర్భంగా పిఠాపురంలో గెలుపు వ్యూహాలపై వారికి సీఎం దిశానిర్దేశం చేశారు. తాజాగా పిఠాపురం సిట్టింగ్ ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు సీఎంవో నుంచి పిలుపు రావడంతో, ఆయన హుటాహుటిన తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వచ్చారు. సీఎం జగన్‌ను ఆయన కలిశారు. పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా వంగా గీతను గెలిపించేలా నియోజకవర్గంలో పనిచేయాలని సీఎం ఆదేశించారు. మళ్లీ అధికారంలోకి రాగానే రాజకీయంగా న్యాయం చేస్తానని ఆయనకు హామీ ఇచ్చారు. పిఠాపురంలో గెలుపు ప్రతిష్ఠాత్మకమని దొరబాబుకు సీఎం జగన్ చెప్పారు. వంగా గీతను గెలిపించుకుని తీసుకురావాలని కోరారు. ఇటీవల వైసీపీ సీట్ల జాబితా ప్రకట నలో పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకినాడ ఎంపీ వంగా గీతాను ప్రకటించారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే దొరబాబు అసం తృప్తిగా ఉన్నారు. దీంతో క్యాంపు కార్యాలయానికి జగన్ పిలిపించి బుజ్జగింపులు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే దొరబాబు మీడియాతో మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు తప్పకుండా వంగా గీతను గెలిపించేందుకు తాను కృషి చేస్తానని చెప్పారు.

పసుపు రైతులకు నష్టపరిహారం ఇప్పించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: దుగ్గిరాలలో శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత పసుపు రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇప్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్‌లో పసుపు దగ్ధమై రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం అందరికీ తెలిసిందేననీ, సమగ్ర దర్యాప్తునకు ఓ కమిటీని నియమించి వీలైనంత త్వరగా రైతులకు న్యాయం జరిగేటట్లు చూస్తామని ప్రభుత్వం, అధికారులు బాధిత రైతులకు హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా పురోగతి కనిపించలేనీ, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కోల్డ్‌స్టోరేజ్ యజమాని తన వ్యాపార లావాదేవీలను యథావిధిగా కొనసాగి స్తున్నారని, కోల్డ్‌స్టోరేజ్ తగులబడుతున్న సమయంలో బయటకు పంపిన వేలాది బస్తాలను తన సొంత సరుకులా అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు న్యాయం జరిగేందుకు కృషి చేయాలని, సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వ్యాపార లావాదేవీలను నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కంజుల విఠల్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు పాల్గొన్నారు.

చంద్రబాబు దృష్టిలో రాజకీయం అంటే దోపిడీ

'మహాదోపిడీ' పుస్తకావిష్కరణలో సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు దృష్టిలో రాజకీయం అంటే దోపిడీ, అవినీతి అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ విజయబాబు రచించిన చంద్రబాబు 'మహాదోపిడీ' పుస్తకాన్ని తాడేపల్లిలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో సజ్జల ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతిని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. రాష్ట్రాన్ని నమిలి మింగడానికి తిరిగి పొత్తులతో ఎన్నికల బరిలో దిగుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అవినీతి విషయంలో విశ్వరూపం ప్రదర్శించారని, అవినీతిని వ్యవస్థీకృతం చేశారని అన్నారు. చంద్రబాబు అనగానే గుర్తుకువచ్చేది అవినీతి. వ్యవస్థలను మేనేజ్ చేసి కరప్ట్ చేయడంలో దిట్ట అని మండిపడ్డారు. వైఎస్ షర్మిలకు స్క్రిప్ట్ ఎక్కడ నుంచి వస్తుందనేదీ రాష్ట్ర ప్రజలు అందరూ గమనిస్తున్నారని చెప్పారు. ఎవరు ఎలా వచ్చినా ఎంత మంది వచ్చినా ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని సీఎం జగన్ ప్రకటించారన్నారు. విజయబాబు మాట్లాడుతూ, చంద్రబాబు అంతులేని అవినీతికి గేట్లు ఎత్తేశారన్నారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, శాసనసభ్యులు మల్లాది విష్ణు, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, కృష్ణంరాజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్లు కొమ్మూరి కనకారావు, అమ్మాజీ, చల్లా మధుసూధన్‌రెడ్డి, కాకుమాను రాజశేఖర్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న మోదీ కల గత పదేళ్ల కాలంలో నెరవేరలేదు. కానీ ఆయన సంకల్ప బలం గొప్పది. ఇంకా ఆ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ప్రతిపక్షం లేని ప్రజాతంత్ర వ్యవస్థను సృష్టించడం కోసం ఆయన వేయని ఎత్తులు లేవు. ఇందులో భాగంగానే నాలుగైదు వారాల కింద కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింప చేశారు. ఆర్థికంగా ప్రతిపక్షం పీక నొక్కి 400 సీట్ల లక్ష్యం సాధించాలన్నది మోదీ పన్నాగం. కాంగ్రెస్ 14 లక్షల రూపాయల లెక్కలు చూపలేదని ఆదాయపు పన్నుశాఖ ఆరోపించింది. ఈ మాట నిజమే అనుకున్నా లెక్కలు చూపకుండా దాచేస్తే జరిమానా విధించే అధికారం ఆదాయపు పన్ను శాఖకు ఉంది. ఇలాంటి సందర్భాలలో సాధారణంగా పదివేల రూపాయల జరిమానా విధిస్తూ ఉంటారు. ఈ మాట ఆదాయం పన్ను చట్టమే చెప్తోంది. కానీ విచిత్రంగా ఆదాయపు పన్నుశాఖ కాంగ్రెస్ కు 200 కోట్ల రూపాయల జరిమానా విధించి చరిత్ర సృష్టించింది. కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న మోదీ లక్ష్య సాధనకోసం ఆదాయపు పన్ను శాఖ సకల నియమాలను, బాహాటంగా ఉల్లంఘించి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేతిలో పరిచారికగా మారింది. మొత్తంమీద కాంగ్రెస్ కు సంబంధించిన 11 బ్యాంకు ఖాతాలను స్తంభింప చేశారు. ఎన్నికలు జరగనున్న సమయంలో ఇలా ప్రధాన ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాలు జప్తు చేయడం అంటే ఆ పార్టీని ఆర్థికంగా నిస్తేజం చేయడమే. అంటే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తమ నాయకుల పర్యటన కోసం కనీసం రైలు టికెట్లు కొనే స్థితిలో కూడా లేకుండా చేయాలని మోదీ ప్రభుత్వం ఆలోచన. ఆదాయపు పన్నుశాఖతో పాటు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్, సీబీఐ లాంటి స్వతంత్ర వ్యవస్థలన్నింటినీ విపరీతంగా దుర్వినియోగం చేస్తున్న మోదీ సర్కారు ఇప్పుడు కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేసి ఆర్థికంగా నిరస్త్రం చేయాలని నిర్ణయించుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలకు తెలియకుండా ఆదాయపు పన్ను శాఖ ఇంత అఘాయిత్యానికి పాల్పడడానికి సాహసించదు. లెక్కలు చూపడంలో కాంగ్రెస్ నెల రోజులు అలస్యం చేసిందట. ఇంకా విచిత్రం ఏమిటంటే ఆదాయపు పన్ను శాఖ అధికారులు కాంగ్రెస్ ఖాతాలున్న బ్యాంకులకు వెళ్లి అక్కడి సిబ్బందిని బెదిరించి, భయపెట్టి కాంగ్రెస్ ఖాతాల నుంచి రూ.115 కోట్లు ఆదాయపు పన్ను శాఖకు బదిలీ చేయించుకుంది. ఈ క్రమం అంతా చూస్తూ ఉంటే మోదీ ప్రభుత్వ ఎత్తుగడ ఏమిటో ఎవరి భాష్యమూ అక్కర్లేకుండానే బట్టబయలు అవుతోంది. 2017-18 నాటి లెక్కలు చూపనందుకు కూడా కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేశారట. ఇదీ విచిత్రమే. ఇంతకు ముందు ఆరేళ్ల తరవాత పాత కేసులు తవ్వి తీసేవారు కాదు. 2022లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడు ఆరేళ్ల గడువును మూడేళ్లకు తగ్గించారు. మరి కాంగ్రెస్ కు ఈ వెసులుబాటు లేకుండా చేయడంలో ఏ దురుద్దేశం లేదని నమ్మలేం. రాజకీయ పార్టీలు ఆదాయం పన్ను చెల్లించనవసరం లేదు కాని లెక్కలు మాత్రం ఆదాయపు పన్ను శాఖకు అందజేయాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పొరపాటు చేసిందనే అనుకున్నా బ్యాంకు ఖాతాలు జప్తు చేయించడానికి ఎన్నుకున్న సమయం ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టంగానే తేలిపోతోంది. కాంగ్రెస్ చూపాల్సిన లెక్కల్లో 0.7 శాతం లెక్కలు చూపనందుకే ఇంత తీవ్రమైన చర్య తీసుకోవడం వెనక కాంగ్రెస్ ను ఎన్నికల సమయంలో ఆర్థికంగా అశక్తం చేయాలన్న కుట్ర దాగి ఉందనుకోవడానికన్నా మించిన కారణం ఏమీ కనిపించదు.

తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేయడాన్ని, దాని వెనక ఉన్న లక్ష్యం గుట్టు విప్పడానికి గురువారం నాడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విలేకరుల సమావేశం నిర్వహించి ప్రజాస్వామ్యం గొంతు నొక్కడానికే తమ బ్యాంకు ఖాతాలు జప్తు చేశారని ఆక్రోశించారు. ఇలాంటి చర్యల ప్రభావం దీర్ఘకాలికంగా ఉంటుంది. ప్రభుత్వం కాంగ్రెస్ విషయంలోనే ఈ దుర్నీతికి పాల్పడిందని సరిపెట్టుకోవడానికి వీలు లేదు. ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారందరూ తీవ్రంగా పట్టించుకోవలసిన అంశం ఇది. బీజేపీ 37 శాతం ఓట్లతో అధికారం సంపాదిస్తే కాంగ్రెస్ దాదాపు 20 శాతం ఓట్లు సంపాదించి అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా నిలిచింది. బీజేపీకి వేల కోట్ల నిధులు సమకూర్చుకోవడం కోసమే ఎన్నికల బాండ్ల విధానం ప్రవేశ పెట్టారు. అనుకున్నట్టే బాండ్ల ద్వారా వసూలైన నిధుల్లో 56 శాతం బీజేపీ ఖాతాలో చేరితే కాంగ్రెస్ కు అందింది 11 శాతం నిధులే. పైగా ఎన్నికల బాండ్లలో అసలు మోసం విరాళాలు ఎవరు ఇచ్చారో, ఎవరికి ఇచ్చారో తెలియకుండా చట్టంలోనే వెసులుబాటు కల్పించడం. ఈ తతంగం అంతా సుప్రీంకోర్టు ఆదేశాలవల్ల వెల్లడి కావడం మంచి పరిణామమే. గురువారం కాంగ్రెస్ అగ్రనాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన తరవాత బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, మాజీ కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. కాంగ్రెస్ ను వచ్చే ఎన్నికలలో ప్రజలు ఓడిస్తారు కనకే విలేకరుల సమావేశం నిర్వహించి కాంగ్రెస్ అగ్ర నాయకులు కన్నీళ్లు కారుస్తున్నారనీ, ప్రజాస్వామ్యం మంటగలిసి పోతుందని ఆరోపిస్తున్నారని నడ్డా అన్నారు. కాంగ్రెస్ మేధో పరంగా, నైతికంగా దివాలా తీసిందని కూడా నడ్డా అన్నారు. దాతలు ఎవరో తెలియకుండా విరాళా లివ్వడానికి ఎన్నికల బాండ్ల చట్టం తీసుకొచ్చిన పార్టీ నైతికత గురించి మాట్లాడడం హాస్యాస్పదమే కాదు, ఈ దేశ ప్రజలను మోసగించడం. ఇక మేధోపరమైన దివాళాకోరుతనం గురించి నడ్డా నుంచి నేర్చుకోవలసి రావడం ఈ దేశ ప్రజలు దిక్కుమాలిన స్థితికి చేరుకున్నారనడానికి నిదర్శనం. కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యం నెరవేరలేదు కనక ఆర్థికంగా ప్రతిపక్షాలను దెబ్బతీసి ప్రజాస్వామ్య సౌధాన్ని కూల్చడానికి మోదీ సర్కారు బుల్డోజర్ రాజకీయాన్ని అనుసరించింది. టర్కీలో కుర్దులకు అనుకూలమైన పార్టీ నిధులను, రష్యాలో ప్రతిపక్ష నాయకుడు నవలానీ బ్యాంకు ఖాతాలను ఇలాగే జప్తు చేశారు. ఖాతాల జప్తును టర్కీ కోర్టు రద్దు చేసింది. పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు షాబాజ్ ఖాతాలు ఇలాగే జప్తు చేయించారు. మన ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య ఛాయలు ఇసుమంతైనాలేని దేశాల స్థాయికి దిగజారుస్తున్నారు. చట్ట విరుద్ధంగా ప్రతిపక్షాల రెక్కలు కత్తిరించడానికి చట్టాన్నే దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను మరో తోవ్పు తోయడమే. ఇది ఒక్క కాంగ్రెస్ కు ఎదురైన పరిస్థితి కాదు. మోదీ ఏలుబడిలో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతోంది. జన జాగృతే దీనికి నిష్కృతి.

సామాజిక మాధ్యమాల విశృంఖలత

చెప్పేది మంచి అయినప్పుడు 'వినదగునెవ్వరు చెప్పిన' అన్నది కరెక్టే. ద్వేషభావం, కోపం, బాధ కలిగించనివి, అసత్యాలు కానివి చెప్పడమైనా, వినడమైనా మంచిదే. కానీ నేడు ఆ సంస్కృతి కనపడడంలేదు. సెల్‌ఫోన్ విచ్చలవిడి వాడకం మొదలైనప్పటి నుంచి సంభాషణల విలువ అథఃపాతాళానికి దిగజారింది. ఉన్నావా? తిన్నావా? పడుకున్నావా? లాంటి తేలికపదాలు, బూతు కవరింగుల ద్వంద్వార్థాల దాకా విలువలేని మాటలే వినసొంపవుతున్నాయి. 'వృథా లావన-వృథా కాలయాపన' జరుగుతోంది. వ్యక్తిగత విషయాలు వదిలేస్తే సామాజిక, రాజకీయ విషయాలకు సంబంధించిన వితండవాదన, విపరీత ధోరణి, విశృంఖల సంభాషణలు, వినలేని, రాయలేని మాటలతో కొత్తపుంతలు తొక్కుతూ జర్నలిజం పేరుతో అనేక చిన్నా చితకా యూట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియా వేదికలు, వారు చెప్పిందే వార్త అన్నట్టు వారి వ్యక్తిగత అభిప్రాయాలను వినాల్సిందే అన్నట్లుగా ప్రజలకు విషయంలో విషాన్ని కలిపి బుర్రలోకి ఎక్కిస్తున్నారు. కొన్ని జాతీయ, స్థానిక దినపత్రికలు, ఛానల్స్ కూడా ఏదో ఒక రాజకీయ నీడలో అక్షరాలకు హంగులద్దుతూ ఆ రంగులు ప్రజలకు పులిమే ప్రయత్నం చేస్తున్నాయి.

యూ ట్యూబులో ఛానల్ ఓపన్ చేయగలిగే జడపదార్థం కూడా జర్నలిజం ఆకారమై, విశృంఖలతకు ప్రాకారమవుతోంది. పుంఖాను పుంఖాలుగా, ఆరోగ్యం, వైరాగ్యం, భక్తి, ముక్తి, విరక్తి, విముక్తి, రాజకీయం, అరాచకీయం ఏదైనా వారి సొంత అభిప్రాయాల కలబోతను మనకు సూక్తిముక్తావళిగా వినిపిస్తున్నాయి. శృంగారాలు, శృతిమించడాలు కూడా ప్రసారాలకు కొత్తదారులు వెతుక్కుంటూ కోరుకున్నవాళ్ళకు కనువిందు చేస్తూనే ఉన్నాయి. 'అంతా నాయిష్టం' అనుకుం టున్న కొన్ని మీడియా వేదికల్లో కనీసం మన వ్యక్తిగత అభిప్రాయం వ్యక్తం చేయడానికి కూడా రాజకీయ పార్టీల అనుమతో, సోషల్ మీడియా అనుమతో తీసుకువాల్సిన దుర్గతి నెలకొంది. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం 2000 నాటి చట్టప్రకారం అశ్లీల వెబ్‌సైట్లను, ఓటీటీ ప్లాట్‌ఫాంలను కొన్నింటిని తొలగించే చర్య తీసుకుంది.

అధునాతన నాగరికతను ఉదాత్తంగా వంటబట్టించుకున్న వారు కొందరు దీన్ని వ్యతిరేకించినా చర్యలు మంచికోసం చేసినవిగా గుర్తించాలి. సోషల్ మీడియా వేదికగా ఎన్నో వ్యాపార, ఉద్యోగ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధితో జీవితాలను మార్చుకుని కీర్తిగడించిన వారెందరో ఉన్నారు. కానీ భావ ప్రకటనా స్వేచ్ఛ ముసుగులో వ్యక్తిగత హననం, అవాస్తవాల ప్రచారాలకు ఈ వేదికలను ఉపయోగించే వారిపై నియంత్రణకు కఠినమైన చట్టాలు లేకపోవడం విచారకరం. ప్రభుత్వాల మీద బురదజల్లే వ్యక్తులు, ఛానళ్లు మాత్రం కేసుల పాలవుతున్నారు. వ్యవస్థీకృతంగా జరిగే నేరాలపైన చర్యలు అంత వేగవంతంగా లేకపోవడంవల్ల అనేకమంది ఇబ్బందుల పాలవుతున్నారు. కొన్ని సందర్భాల్లో మహిళలపై మహిళలే అసభ్యకరంగా పోస్టులు పెట్టడం ఈ సమాజంలోని భ్రష్టత్వాన్ని బహిరంగ పరుస్తోంది. పార్టీలు, ప్రభుత్వాలు, నాయకులపట్ల లేక ఈ సమాజం పట్ల ఏ మనిషికైనా ఉన్న వ్యక్తిగత అభిప్రాయాన్ని సున్నితంగా భావ వ్యక్తీకరణ చేయడంలో తప్పులేదు. కానీ తమకు భజన చేయనివారందరినీ బలి తీసుకుంటామంటే మాత్రం అది ఆమోదించవలసిన విషయం కాదు. కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికత సరైన రీతిలో ఉపయోగించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత.

జోస్యుల వేణుగోపాల్
సెల్: 9440436806

విరాళాల ముందు బాండ్లు ఎంత?

నిత్య చక్రవర్తి

ఎన్నికల బాండ్ల ద్వారానే గాక ఇతర అనేక మార్గాల ద్వారా బీజేపీకి అపారంగా నిధులు సమకూరుతున్నాయి. బాండ్ల ద్వారా అన్ని పార్టీలకంటే చాలా ఎక్కువ నిధులువచ్చాయి. బాండ్లు రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్ తీర్పు చెప్పారు. ఎవరెవరు ఎంత మొత్తానికి బాండ్లు కొనుగోలు చేసింది, ఏ పార్టీకి ఎంత లభించింది, ఇతర పూర్తి వివరాలు వెల్లడించాలని బాండ్లు అమ్మిన ఎస్‌బీఐని ఆదేశించినప్పటికీ బ్యాంకు సరదాగా తీసుకొంటూ ఇంతవరకు పూర్తిసమాచారం ఎన్నికల కమిషన్‌కు గానీ, లేదా కోర్టుకు గానీ అందించలేదు. 2019 ఏప్రిల్ 12 నుండి 2024 ఫిబ్రవరి వరకు (ఇదేరోజు ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది) బాండ్ల ద్వారా రూ.16,494 వేలకోట్లు రాగా బీజేపీకి రూ.8.250 వేల కోట్లు వచ్చాయి. అంటే అత్యధిక ఆదాయం బీజేపీకే వచ్చింది. ప్రధాని మోదీయే ఈ పథకాన్ని ఎవరితో సంప్రదించకుండా ప్రకటించారని ప్రచారం జరిగింది. కొనుగోలు చేసినవారికి, ప్రయోజనం పొందిన పార్టీకి మధ్యగల గల రహస్యాలు బంధాన్ని ఎస్‌బీఐ వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మార్చి 21 తర్వాత కొనుగోలు చేసినవారికి, ప్రయోజనం పొందిన పార్టీకి, ప్రధానంగా పాలకపార్టీకి ఎంత వచ్చింది వెల్లడయ్యే అవకాశం ఉంటుంది. బాండ్ల కొనుగోలు మూలంగా ఇచ్చిపుచ్చుకునే అవకాశం ఉండవచ్చునని కూడా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. బాండ్ల ద్వారా వచ్చిన విరాళాల కంటే బీజేపీకి ఇతర మార్గాల ద్వారా రహస్యనిధులు ఎక్కువ వస్తున్నాయి. అనేక మార్గాల ద్వారా వచ్చే విరాళాల సంఖ్య బీజేపీకి బాండ్ల ద్వారా వచ్చే విరాళాలు ఒకటి. వీటిపై ఎన్నికల కమిషన్ దర్యాప్తు చేయించాలి.

18వ లోకసభ ఎన్నికలు ఏప్రిల్ 19నుండి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ఏడు దశల్లో పూర్తి అవుతుంది. ఎన్నికల బాండ్లు ద్వారా, ఇతర మార్గాల్లో వచ్చిన ధనరాశులు 2024 ఎన్నికల్లో బీజేపీ ఖర్చుచేయనున్నది. ఏడు దశల్లో ఎన్నికలు జరిగి జూన్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారు. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చే నిధుల కంటే విదేశాల నుండి వచ్చే విరాళాలే చాలా ఎక్కువగా ఉన్నాయి. ప్రత్యేకించి అమెరికాలో వజ్రాల వ్యాపారుల నుండి, ఇతరుల నుండి వచ్చే నిధుల మొత్తం అపారం. అయితే ఇది అంతా రహస్యం. మధ్య దళారుల్లో అత్యధికులు, ఇంకా ఇతరుల మధ్య బీజేపీకి అత్యంత సాన్నిహిత్యం ఉంది. సంప్రదాయ వ్యాపారులు, బడా వాణిజ్యవేత్తలకు దశాబ్దాలుగా బీజేపీ మధ్య లోతైన స్నేహ సంబంధాలున్నాయి. వాస్తవంగా బీజేపీ, సంఘ్‌పరివార్‌లో వీహెచ్‌పీలకు అనేకదేశాలలో పెద్ద మొత్తాల్లో విరాళాలుఇచ్చే వారున్నారు. బీజేపీతో పోలిస్తే, కాంగ్రెస్‌కు వచ్చే విరాళాలు అతి స్వల్పం. వీహెచ్‌పీ, ఇతర హిందు సంఘాల నియంత్రణలో అనేక హిందూ ఆలయాలు ఉన్నాయి. వీటినుంచి బీజేపీకి విరాళాలు సమకూరుతాయి. అమెరికా, బ్రిటన్ ఐరోపాలోని అనేక దేశాలు, ఇటీవలికాలంలో పశ్చిమాసియాలోని చాలా దేశాల నుంచి బీజేపీకి, సంఘ్‌పరివార్ అనుబంధ సంస్థలకు విరాళాలు కుప్పలుతెప్పలుగా వస్తున్నయని తెలుస్తోంది. ఆలయాలకు అనుబంధంగా ఉండే ట్రస్టీలు, భారీగా నిధులను అందచేస్తాయి. ప్రపంచంలో 10కోట్లకుపైగా సభ్యత్వం కలిగిన రాజకీయ పార్టీ బీజేపీ ఒక్కటే. ఈ నేపథ్యంలో బీజేపీకి, సంఘ్‌పరివార్‌కు నిరంతరం విరాళాలు వస్తూనే ఉంటాయి. విదేశాల నుంచి వచ్చే విరాళాలపైన సాధారణంగా అనేక ఆంక్షలు ఉంటాయి. బీజేపీ పాలకపార్టీ గనుక ఏ ఏజన్సీలు కూడా ఆటంక పరచవు. వచ్చేవిరాళాల ధనం ఎంతని ఎవరికీ తెలియదు.

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో టీఆర్‌ఎస్ ఎమ్‌ఎల్‌ఏలను తమవైపు తిప్పుకునేందుకు ఒక్కొక్కరికి 100కోట్లకుపైగా ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పుడు హైదరాబాదులో ఈ విషయం మారుమోగింది. ఎప్పటిలాగానే బీజేపీ నాయకులు ఈ వ్యవహారాన్ని తిరస్కరించారు. 2014 నుంచి బీజేపీకి ఇది కొత్తేమీకాదు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవేత్తల నుంచి విరాళాలు ఆనాటి నుండి బీజేపీకి ఖాతాలో పడుతూనే ఉన్నాయి. ఇందుకు బదులుగా వారికి అనేక రూపాలలో ప్రభుత్వం నుంచి ప్రయోజనం లభిస్తోంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల తర్వాత గత 5ఏళ్లలో కర్నాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ప్రభుత్వాలను అస్థిరీకరించడానికి, అలాగే గోవా, మణిపూర్‌లలో ఎంఎల్‌ఏలను కొనుగోలు చేసేందుకు కోట్లాది రూపాయలు బీజేపీ ఖర్చు చేసింది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర వ్యవహారం తాజా ఉదాహరణ. శివసేన నుంచి ఏక్‌నాథ్‌షిండే గ్రూపును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు 200కోట్ల రూపాయలకుపైగా నిధులను ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. షిండే-బీజేపీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దర్యాప్తుసంస్థలు నిధులు సమకూర్చని కార్పొరేట్లపై దాడులు జరుగుతాయని భయపడుతూనే ఉంటారు. అయితే వారి కొత్త వారసులు బీజేపీని లెక్కచేయడంలేదు. అలాంటివారిపైన దాడులు తప్పవు. అనంతరం యువత ధోరణికూడా మరిపోయింది.

గత పదేళ్ల మోదీ పాలనలో ఊహించలేనంతగా ధనరాశులు కార్పొరేట్లవద్ద చేరాయి. వీరంతా మోదీకి విరాళాలు ఇచ్చి తమకు కావలసిన పనులు చేయించుకుంటారని ప్రతీతి. 1990లో 20 సంస్థలకు వచ్చిన మొత్తం లాభాలు 14శాతంకాగా, 2010నాటికి అవి 30శాతం అయ్యాయి. 2019నాటికి ఈ లాభాలు 70శాతానికి పెరిగాయి. మోదీ పాలనలో లాభాలు ఒక్క దుముకు దుమికాయి. కార్పొరేట్లకు, బీజేపీకి విడదయలేని బంధం ఏర్పడింది. మార్కెట్‌ల శక్తి మూలంగా అపారమైన లాభాలు వచ్చాయని ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్ బర్దన్ అంచనావేశారు. ప్రధానమంత్రి మోదీ కొంతమంది ఎంపికచేసుకున్న కార్పొరేట్లకు, బడా వాణిజ్యవేత్తలకు అనుకూలంగా మార్కెట్‌ను మార్చివేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రముఖ పారిశ్రామిక సంస్థలు మోదీకి అపారంగా నిధులు సమకూర్చిఉంటాయని విస్తృతంగా వస్తున్న సమాచారం. ఒకే దేశం, ఒకే మార్కెట్ పథకం పెద్దపెద్ద కంపెనీలకు ప్రయోజనం చేకూర్చింది. దేశీయ కంపెనీలు దెబ్బతిన్నాయి. టెలికాం, ఎయిర్‌లైన్స్, స్టీల్, సిమెంటు, అల్యూమినియం రంగాలలో మోదీ విధానం కారణంగా మార్కెట్‌లోని మొత్తం కంపెనీలలో 50శాతం బడాకంపెనీల నియంత్రణలోకి వచ్చాయి. మోదీ ప్రభుత్వం మూలంగా ఆశ్రిత పెట్టుబడుదారులు భారతదేశ ఆర్థికవ్యవస్థను ఎలా స్వాధీనం చేసుకున్నదన్న అంశాన్ని ఆర్థికవేత్త డాక్టర్ ప్రణబ్ బర్దన్ విశ్లేషించారు. ఆత్మనిర్భర్ లాంటి పథకాలు మనకు ప్రయోజనం లేకుండాపోయాయి. దిగుమతి చేసుకునే పరికరాలను అసెంబుల్ చేసి తిరిగి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వాటి ముందు దేశీయ కంపెనీలు నష్టపోతున్నాయి. 2016-2021 మధ్య కాలంలో ఆశ్రితపెట్టుబడీదారీ నల్లధనులు 29శాతం నుంచి 43శాతానికి పెరిగాయి. మోదీ నల్లధనులను, అవినీతిని పెంచారు.

యువతకు మార్గదర్శులైన యువకిశోరాలు

నక్కి లెనిన్ బాబు

భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని అనేకమంది పోరాటలు చేసిన చరిత్ర తెలిసిందే. సిపాయిల తిరుగుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించిన మంగళ్ పాండే, సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టిన మహాత్మా గాంధీ, సాయుధ పోరాటాన్ని ప్రారంభించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ, ఆజాద్ హింద్ ఫౌజ్, సుభాష్ చంద్రబోస్, విదేశాల్లో చదువుతున్న యువతను ఐక్యం చేసి గదర్ పార్టీ ఏర్పాటుచేసి నాయకత్వం వహించిన కర్తార్ సింగ్ సారాభాలు, సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ లాలాలజపతిరాయ్ ఉద్యమించారు. బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడి వీర మరణం పొందిన ఝాన్సీ లక్ష్మీబాయి, తెలుగు గడ్డపై వీరోచితమైన పోరాటాలు చేసిన అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ సభ్యులు సర్దార్ భగత్ సింగ్, సుఖదేవ్ దాపర్, శివరాం రాజ్ గురుల వీరోచితమైన త్యాగాలు అసమానమైనవి.

సర్దార్ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28వ తేదీన బంగా గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ సింగ్ పినతండ్రి అజిత్ సింగ్ భారత స్వాతంత్ర పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొంటున్న రోజులవి. ఈ నేపథ్యంలో భగత్ సింగ్‌పై చిన్నప్పటి నుంచే స్వాతంత్ర ఉద్యమ ప్రభావం పడింది. 1919 ఏప్రిల్ 13వ తేదీన జలియన్‌వాలాబాగ్ దారుణ సంఘటన నాటికి 12 సంవత్సరాల వయస్సు ఉన్న భగత్ సింగ్‌పై చెరగని ముద్రవేసింది. బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడాలని నిర్ణయించు కున్నాడు. జలియన్‌వాలాబాగ్‌లో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా సుమారు 20వేల మంది సమావేశమైన సందర్భంలో జనరల్ డయర్ విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో వందలాదిమంది మరణించడం, అనేకమంది గాయాలపాలై రక్తంతో జలియన్‌వాలాబాగ్ తడిసిపోయింది. అక్కడికి వెళ్లిన భగత్ సింగ్ రక్తంతో తడిచిన మట్టిని తీసుకొని డయ్యర్‌ను చంపాలని ప్రతినబూనాడు. నౌ జవాన్, భారత సభ ప్రేరణతో అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. లాహోర్ నేషనల్ కాలేజీలో చేరిన భగత్ సింగ్ చురుకుగా ఉంటూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనేవాడు. 1928 అక్టోబర్ 30 తేదీన వచ్చిన సైమన్ కమిషన్‌ను గో బ్యాక్ అంటూ పోరాటం చేసిన పంజాబ్ సింహం లాలాలజపతిరాయ్‌ను పోలీస్ అధికారి స్కాట్ లాఠీచార్జి చేయడంతో తలపై బలమైన గాయం అయ్యింది. లాలా లజపతిరాయ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పంజాబ్ ప్రజలు ఆయన మృతి పట్ల పెద్ద ఎత్తున బ్రిటిష్ పాలన కు వ్యతిరేకంగా ఉద్యమించారు.

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర లక్ష్యం కావాలని పోరాడుతున్న నేపథ్యంలో చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ ఏర్పడింది. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా యువతను ఐక్యం చేసి కళాశాలలో విద్య నభ్యసిస్తున్న సర్దార్ భగత్ సింగ్, సుఖదేవ్ థాపర్‌తోపాటు శివరాం రాజ్ గురు పోరాడారు. హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ ని హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ గా మార్చుకొని చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో పనిచేశారు. లాలాలజపతిరాయ్ పై లాఠీ ఛార్జ్ చేసి మృతికి కారణమైన బ్రిటిష్ పోలీస్ అధికారి స్కాట్‌ను హత్య చేయాలని నిర్ణయించుకొని 1928లో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురులు లాహోర్ పోలీస్ స్టేషన్ లో ఉన్న స్కాట్ పోలీస్ స్టేషన్ నుంచి బయటికి రాలేదు. అదే సమయంలో మరో పోలీస్ అధికారి జెపి సాండర్స్ పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన వెంటనే సాండర్స్ పై కాల్పులు జరిపి అతన్ని హతమార్చారు.

ఉద్యమాలను అణిచివేయాలని దేశంలో నూతన చట్టాల అమల కోసం బ్రిటిష్ ప్రభుత్వం కుట్ర చేస్తున్న నేపథ్యంలో శాసనసభలో సర్దార్ భగత్ సింగ్, సుఖదేవ్ ఇతర ఉద్యమ నాయకులు పొగబాంబు వేశారు. వలస పాలన నశించాలని, ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాలు చేస్తూ పోలీసు లకు లొంగిపోయారు. బ్రిటిష్ పోలీస్ అధికారి జెపి సాండర్స్ హత్య కేసులో వీరు భాగస్వామ్యంగా ఉన్నారని విచారణ ప్రారంభించారు. జైల్లోనే ఉంటూ రాజకీయ ఖైదీలకు హక్కులు కల్పించాలని, సరైన సౌకర్యాలు కల్పించి, వార్తాపత్రికలు అందించాలని కోరుతూ భగత్ సింగ్ సుమారు 64 రోజులపాటు నిరాహార దీక్ష చేశారు. జెపి సాండర్స్ హత్య కేసులో సర్దార్ భగత్ సింగ్, సుఖదేవ్ థాపర్, శివరాం రాజ్ గురులను దోషులుగా ప్రకటించి 1931 మార్చి 24వ తేదీన మరణశిక్ష ప్రకటిం చారు. మరణ శిక్ష నుంచి జీవిత ఖైదీగా ఉండేందుకు మిత్రులు క్షమాభిక్ష పిటిషన్‌పై సంతకం చేయాలని కోరగా నేను నమ్మిన సిద్ధాంతంకోసం ప్రాణాలు అర్పిస్తానని, చిరునవ్వుతో ఉరికంబం ఎక్కిన దేశభక్తుడు. విచారణ సంద ర్భంగా జడ్జి ముందు మీరు వ్యక్తులను చంపడం సులువైనప్పటికీ సిద్ధాంతాలను సమాధి చేయలేరని జడ్జితో అన్నారు. గొప్ప సామ్రాజ్యాలు కూలిపోయినా సిద్ధాంతాలు మాత్రం సజీవంగా ఉంటాయని భగత్ సింగ్ అన్నారు. మీ చివరి కోరిక ఏమిటని జడ్జి అడిగితే గదర్ పార్టీ నాయకుడు కర్తార్ సింగ్ సారాభా మళ్లీ జన్మిస్తే మీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఉరి కంబాన్ని ముద్దాడుతామని చెప్పారు. ఉరితీసే ముందు పోలీసు అధికారులు వచ్చి మీరు స్నానం చేసి తయారు కావాలని చెప్పగా రష్యా కమ్యూనిస్టు విప్లవ నేత వి.ఐ.లెనిన్ రచన చేసిన వాట్ డూ జీవిత చరిత్ర చదువుతూ ఒక కమ్యూనిస్టు మరొక కమ్యూనిస్టు తో మాట్లాడుతున్నానంటూ సమా ధానం చెప్పాడు. 23 సంవత్సరాల వయసు కలిగిన సుఖదేవ్, రాజ్ గురులను విడుదల చేయాలని దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైంది. లాహోర్ జైలు గోడలు బద్దలు కొట్టి విడిపించాలని లక్షలాది మంది ప్రజలు అక్కడికి చేరుకోవడంతో నిబంధనలకు విరుద్ధంగా ఒక్కరోజు ముందే మార్చి 23 సాయంత్రం 7 గంటలకు సర్దార్ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురులను ఉరితీసి దొంగ దారిన హుస్సేనీవాల దగ్గర్లో ఉన్న సట్లేజ్‌నది దగ్గర వారి అంతక్రియలు నిర్వహిస్తున్న విషయం ప్రజలు తెలుసుకుని అక్కడికి వెళ్లారు. వేలాదిమంది ప్రజలు అక్కడికి రావడంతో పోలీసు అధికారులందరూ పరారు కావడం అనంతరం ప్రజలు భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురుల సగం కాలిన శరీరాలకు ప్రజలే అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్నో త్యాగాలు, పోరాటాలు, బలిదానాల వల్ల సాధించుకున్న స్వాతంత్రాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం స్వాతంత్ర ఫలాలను పక్కనపెట్టి ప్రజా సంక్షేమం కాకుండా కార్పొరేట్ సంక్షేమం కోసం కుట్ర చేస్తున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండవలసిన సమయం ఆసన్నమైంది. లాభాలు బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసి ప్రైవేటీకరణ చేయాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. రైల్వే, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, ఓడరేవులు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, గ్యాస్, ఆయిల్ కంపెనీలన్నీ కూడా ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు పరిపాలన సాగిస్తున్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీనీ ప్రైవేటీకరణ చేస్తున్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన హామీ అమలు కాలేదు. విదేశాల్లో దాగిన కోట్లాది నల్లధనాన్ని తీసుకురావడంలో వైఫల్యం చెంది మతోన్మాద రాజకీయాల ద్వారా లబ్ధి పొందేందుకు మోదీ ప్రయత్నిస్తున్నాడు. భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యం, లౌకిక అనే పదాలను తొలగించి మను ధర్మశాస్త్రం అమలు కోసం మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రల పట్ల యువత అప్రమత్తంగా ఉండడంతోపాటు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం, మతసామరస్యాన్ని కాపాడుకుంటూ ఉద్యమించినప్పుడే అమరవీరులకు నిజమైన నివాళి.

(మార్చి 23 సర్దార్ భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా)

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి
సెల్: 918247806001

అభ్యుదయ, లౌకిక భావజాల వ్యాప్తికి కృషి

ప్రవాసాంధ్రులకు రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అభ్యుదయ, లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష భావజాల వ్యాప్తికి ప్రవాసాంధ్రులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. అమెరికాలోని డల్లాస్‌లో నివసించే ప్రవాసాంధ్రుడు, సాహితీవేత్త లెనిన్ వేముల స్వదేశానికి వచ్చిన సందర్భంగా గురువారం స్థానిక సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి నాగభూషణరావు భవన్‌లో సీపీఐ రాష్ట్ర నాయకత్వాన్ని కలిశారు. ఈ సందర్భంగా జరిగిన ఇష్టాగోష్టి సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ తానా మహాసభలకు అమెరికా వెళ్లినప్పుడు తాను లెనిన్‌ను కలిశానని గుర్తుచేసుకున్నారు. భారత సంస్కృతీ, సంప్రదాయాలకు, తెలుగు సాహిత్య సౌరభాలకు అమెరికాలో లెనిన్ వేముల విస్తృత ప్రచారం చేస్తున్నారని కొనియాడారు. ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ మాతృభూమిని మరిచిపోకుండా సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. అభ్యుదయ, లౌకిక, వామపక్ష భావాల వ్యాప్తికి, అమెరికాలోని తెలుగువారిని సంఘటితం చేయడానికి మరింత కృషి చేయాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా మాచర్ల ప్రాంతానికి చెందిన లెనిన్ వేముల చిన్నతనం నుంచి వామపక్ష భావజాలాన్ని అలవర్చుకున్నారనీ, అమెరికాలో స్థిరపడిన సాహితీవేత్తగా, అభ్యుదయవాదిగా అక్కడి తెలుగువారిని కూడగట్టి చైతన్య పరచడంలో విశేష కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, వై.చెంచయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, కమ్యూనిజం మాసపత్రిక సంపాదకుడు చలసాని వెంకటరామారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు అక్కినేని చంద్రరావు, మహిళా సమాఖ్య నాయకులు ఎం.అరుణకుమారి, సీపీఐ నాయకులు టి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. లెనిన్ వేముల మాట్లాడుతూ అమెరికాలో లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య భావజాల వ్యాప్తికి మరింత కృషి చేయనున్నట్టు చెప్పారు. తెలుగు భాషా వికాసానికి తన వంతు సహకారమందిస్తానన్నారు. ఈ రోజు ఇంతమంది లౌకిక భావాలు కలిగిన వారితో సమావేశం కావడం సంతోషంగా ఉందని చెప్పారు. తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు తెలి పారు. అంతకుముందు రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వర రావు, జల్లి విల్సన్, ఓబులేసు, వనజ, మోదుమూడి రామారావు తదితరులు లెనిన్ వేములను శాలువా, బొకేలతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పుస్తకాలను మనోహర్‌నాయుడు, సంపాదక చక్రవర్తి సి.రాఘవాచారి సంపాదకీయాల సంపుటాలను అక్కినేని చంద్రరావు లెనిన్ వేములకు అందజేశారు. సీపీఐ కృష్ణాజిల్లా నాయకులు మోదుమూడి రామారావు తొలుత లెనిన్ వేముల జీవన నేపథ్యం, అమెరికాలో ఆయన చేస్తున్న కృషిని వివరించారు.

హైకోర్టులో ఏపీపీఎస్సీకి ఊరట

- గ్రూప్-1 మెయిన్స్ రద్దుపై తాత్కాలిక స్టే
- ఎంపికైన ఉద్యోగులు యథాతథం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: గ్రూప్–1 మెయిన్స్ రద్దుపై హైకోర్టులో ఏపీపీఎస్సీకి కాస్త ఊరట లభించింది. గతంలో హైకోర్టు సింగిల్ బెంచి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీ ఆశ్రయించగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై తాత్కాలిక స్టే విధించింది. దీంతో గ్రూప్ –1 మెయిన్స్‌లో ఎంపికై ప్రస్తుతం ఉద్యోగాల్లో ఉన్న వాళ్లు యథాతథంగా కొనసాగుతారని డివిజన్ బెంచి స్పష్టం చేసింది. ఈ కేసు విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు డివిజన్ బెంచి సమగ్ర విచారణ నిర్వహించింది. ఈ కేసులో తుది ఆదేశాలు వచ్చేంత వరకు ఉద్యోగులు తమతమ ఉద్యోగాల్లో కొనసాగుతారని స్పష్టంచేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో (2018) గ్రూప్ –1 కింద 167 పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ఎంపికలో అవకతవకలు జరిగాయని, మూడు సార్లు మూల్యాంకనం జరిగిందని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో డిజిటల్ మూల్యాంకనాన్ని రద్దు చేసి, ఒకసారి మాత్రమే మాన్యువల్‌గా మూల్యాంకనం చేశామని ఏపీపీఎస్సీ బోర్డు వాదనలు వినిపించింది. ఏపీపీఎస్సీ బోర్డు, ఇరువర్గాల వాదనలు సింగిల్ జడ్జి బెంచ్ మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. మే 26, 2022న ఏపీపీఎస్సీ ప్రకటించిన ఉద్యోగాల జాబితాను తిరస్కరించింది. దీంతో ఆ నోటిఫికేషన్ ద్వారా ఎంపికై ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారంతా ఆందోళనకు గురయ్యారు. వారికి నష్టం కలగకుండా సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ, హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించడంతో తాత్కాలికంగా స్టే విధించింది.

మా పోరు ఆగదు... కోడ్ అడ్డు కాదు

రైతు నేత పంధేర్

చండీగఢ్: తమ పోరు ఆగబోదని, తమ ఉద్యమానికి ఎన్నికల కోడ్ అడ్డు కాదని రైతు నాయకుడు సర్వార్ సింగ్ పంధేర్ తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల అజెండాను ప్రజల ముందు ఉంచుతున్నామని చెప్పారు. శాంతియుతంగా ఆందోళనను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ల సాధన వరకు వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తేదీలను ప్రకటించడంలో దేశంలో కోడ్ అమల్లోకి వచ్చింది కానీ దానితో మా పోరాటానికి సంబంధం లేదు అని అన్నారు. ట్రాక్టర్-ట్రాలీలతో దేశ రాజధానికి వెళ్లనివ్వకుండా బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటుడటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శంభు, ఖనౌరీ వద్ద భారీగా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, భద్రతా బలగాలను హర్యానా మోహరించడాన్ని ఆక్షేపించారు. మా డిమాండ్లకు మద్దతుగా దిల్లీకి వెళ్లకుండా రైతులను ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. అమృత్‌సర్, జండియాలా, బియాస్ నుంచి రైతులు పెద్ద సంఖ్యలో సరిహద్దుల్లోని శిబిరాలకు తరలినట్లు తెలిపారు. పంజాబ్-హర్యానా సరిహద్దుల వెంబడి రైతుల ఆందోళనలు కొనసాగుతాయని పంధేర్ వెల్లడించారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ ముక్తి మోర్చా అధ్వర్యంలో దిల్లీ చలో మార్చ్ ద్వారా తమ డిమాండ్ల సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు పోరాడుతున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చట్టబద్ధతను డిమాండ్ చేస్తున్నారు. పంజాబ్ రైతులు ఫిబ్రవరి 13 నుంచి శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద ఆందోళన చేస్తున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతులకు పింఛన్లు, 2021 లఖింపూర్ ఖేరి బాధితులకు న్యాయం, రైతులపై కేసుల ఉపసంహారణ, విద్యుత్ టారిఫ్‌పై పెంపు వద్దు, 2020–21 రైతాంగ పోరులో అమరులైన రైతుల కుటుంబాలకు పరిహారం వంటివి రైతుల ప్రధాన డిమాండ్లలో ఉన్నాయి.

విశాఖ ఉక్కుకు విద్యుత్ కష్టాలు

- రూ.140 కోట్ల బకాయిలు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు
- కర్మాగారం నిర్వీర్యానికి కుట్ర



విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోంది. ప్రైవేటీకరణ చేయకుండానే అనేక అవాంతరాలు సృష్టించి చంపేయాలని చూస్తోంది. తాజాగా విద్యుత్ కష్టాలతో ఉక్కు పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేసేలా కుట్ర చేసింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారానికి ఇవ్వాల్సిన సొంత గనులు ఇవ్వకపోవడంతో పాటు రూ.5వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వలేదు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోంది. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదు. విశాఖ ఉక్కు ప్రారంభంలోనే 550 మెగా వాట్ల విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పారు. దీనిలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ల 250 మెగా వాట్లు స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా చేయగా... మిగిలిన 300 మెగా వాట్ల విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందించేవారు. దానికి కావాల్సిన బొగ్గు సరఫరా కోసం ఒడిశాలోని కోల్ ఇండియాతో ఒప్పందం చేసుకుంది. ఏటా సుమారు 17లక్షల టన్నులు థర్మల్ బొగ్గును విశాఖ ఉక్కుకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడు బొగ్గు సరఫరా చేయాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అడుగుతుంటే సరఫరా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి రావడంతో బొగ్గు సరఫరా కూడా తగ్గించేశారు. దీంతో విద్యుత్ కోసం ఈపీడీసీఎల్‌పై స్టీల్‌ప్లాంట్ ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెల రూ. 90కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి సంబంధించి రూ. 140 కోట్లు వరకు బకాయి పడటంతో ఏపీ ఈపీడీసీఎల్ (విద్యుత్) అధికారులు నోటీసులు ఇచ్చి బకాయిలు చెల్లించమంటూ ఇబ్బందులు పెడుతున్నారు. బకాయిలు చెల్లించకపోతే సరఫరా నిలిపివేస్తామని బెదిరిస్తున్నారని స్టీల్ ప్లాంట్ అధికారులు తెలియజేశారు. పెరిగిన విద్యుత్ బిల్లును విశాఖ ఉక్కు చెల్లించలేని స్థితి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రయోజనాల కన్నా కేంద్రంలోని మోదీసర్కారు ప్రయోజనాలకు వత్తాసు పలుకుతోంది. గతంలో విశాఖ ఉక్కుకు వచ్చే ఇసుక ర్యాంపులు ఇవ్వకుండా ఆపేశారు. తాజాగా విద్యుత్ కష్టాలు మొదలైతే విశాఖ ఉక్కు మనుగడ ప్రమాదంలో పడే పరిస్థితి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఒడిశా నుండి రావల్సిన బొగ్గును రప్పిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఏనాడు రాష్ట్ర పరిశ్రమల మంత్రిగా వున్న అమర్‌నాథ్ పట్టించుకోలేదని... ఈ కారణంగానే విశాఖ ఉక్కు ప్రమాదంలో పడిందన్న విమర్శలున్నాయి. ఒడిశాలోని మహానది నుంచి వచ్చే థర్మల్ బొగ్గు టన్ను కేవలం రూ.3200లకు దొరకుతుంది. ఇదే అదాని కంపెనీల నుండి టన్నుకు రూ.6500 నుండి రూ.12వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. విశాఖ ఉక్కు ఇప్పుడున్న పరిస్థితిలో ఇంత భారాన్ని మోసేస్థితిలో లేదు. విశాఖ ఉక్కును కష్టకాలంలో ఆదుకోవాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వంతో వైసీపీ కుమ్మక్కై విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తే తమకు తీరని ద్రోహం చేసినట్లేనని విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలు మండిపడుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బీఎఫ్–3ని జిందాల్ కంపెనీకి అప్పజెప్పారు.

జిందాల్ కంపెనీ, ఏపీఎండీసీ ఉమ్మడిగా జాయింట్ వెంచర్‌లో ప్రభుత్వం వాటా 11శాతంగా, జిందాల్ వాటా 89శాతంగా కట్టబెట్టి జిందాల్‌కు లాభాలు చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఐరన్‌ఓర్ టెండర్‌కు జిందాల్ జేఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్, జిందాల్ ఎస్ఏడబ్ల్యు లిమిటెడ్ సంస్థలే టెండర్లు వేయగా... మూడో కంపెనీకి అవకాశం లేకుండా చేస్తున్నారు. జిందాల్ ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కృషిచేసే దానికన్నా జిందాల్ ప్రయోజనాలే పరమావధిగా ఉంది. బీఎఫ్–3 జిందాల్ కంపెనీకి ఇచ్చిన తరువాత స్టీల్‌ప్లాంట్ సొంతగా నిర్వహిస్తున్న బీఎఫ్–1, 2ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. యావత్తు స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విద్యుత్ కష్టాల నుండి ఉక్కు పరిశ్రమను కాపాడాలని... లేదంటే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

బీజేపీకి రాజకీయ ఆయుధం ఈడీ: అతిషి

న్యూదిల్లీ: లిక్కర్ స్కామ్ కేసులో తొమ్మిదోసారి సమన్లు అందుకున్నప్పటికీ సీఎం కేజ్రీవాల్ విచారణకు హాజరు కాలేదు. షెడ్యూల్ ప్రకారం గురువారం కేజ్రీవాల్‌ను విచారణకు రమ్మని ఈడీ సమన్లు జారీ చేసింది. కేజ్రీవాల్ ఈడీ విచారణ అంశంపై ఆప్ మంత్రి అతిషి మర్లీనా స్పందించారు. ఈడీ విచారణకు కేజ్రీవాల్ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే తనను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలివ్వాలంటూ కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని అతిషి తెలిపారు. విచారణకు వెళ్తే ఈడీ అరెస్ట్ చేస్తుందన్న అనుమానం తమకు ఉందన్నారు. కేజ్రీవాల్ ఈడీ దర్యాప్తునకు హాజర వ్వాలనుకుంటున్నారని, కానీ ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను తాము స్వతంత్ర సంస్థగా చూడటం లేదని, అది బీజేపీకి రాజకీయ సాధనంగా పని చేస్తుందని అతిషి ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని ఈడీ భావిస్తోందని, ఒకవేళ ఆయనను దర్యాప్తు సంస్థ విచారించాలనుకుంటే... అరెస్ట్ చేయబో మని కోర్టులో ఈడీ చెప్పాలని మంత్రి అతిషి పేర్కొ న్నారు. దిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో తొమ్మిదిసార్లు నోటీసులు జారీ చేసినా కేజ్రీవాల్ హాజరుకాకపోవడంతో కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

కేంద్రమంత్రి శోభపై కోడ్ ఉల్లంఘన కేసు

బెంగళూరు: కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత శోభా కరంద్లాజేపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. తమిళనాడు ప్రజలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో ఆమెపై ఎన్నికల సంఘానికి అధికార డీఎంకే ఫిర్యాదు చేసింది. దీంతో సత్వరమే చర్యలు తీసుకోవాలని కర్నాటక ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ)ను ఎన్నికల సంఘం ఆదేశించింది. 48గంటల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని స్పష్టంచేసింది. ఆ మరుసటి రోజే కరంద్లాజేపై కేసు నమోదు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా తన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి ఇప్పటికే క్షమాపణ చెప్పారు. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.

జేఎన్‌యూలో ఎన్నికల హోరు

- మణిపూర్, సీఏఏ, ఎన్నికల బాండ్లపై అభ్యర్థుల ప్రసంగాలు- చర్చలు
- 22న పోలింగ్ -24న ఫలితాలు

న్యూదిల్లీ: జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యార్థి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్ష పదవి కోసం గట్టి పోటీ నెలకొంది. అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. జై భీమ్, భారత్ మాతా కీ జై, లాల్ సలామ్ నినాదాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. తమ ప్రసంగాల్లో జాతీయ, అంతర్జాతీయ అంశాలను ప్రస్తావిస్తున్నారు. మణిపూర్‌లో హింస, ఎన్నికల బాండ్లు, సీఏఏ గురించి చర్చలు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో ఝీలమ్ లాన్‌లో చర్చావేదిక ఏర్పాటు కాగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరుకొన్నారు. డప్పులు, ట్రంపెట్లతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ సంఘాల నాయకులకు మద్దతు తెలిపారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి వి.రామసుబ్రమణ్యం సమక్షంలో ఈ చర్చ జరిగింది. గత వారంలో దిల్లీ హైకోర్టు ఆయనను జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల పరిశీలకునిగా నియమించింది. విద్యార్థి సంఘాల నాయకులు మణిపూర్ హింస, పౌరసత్వ సవరణ చట్టం, రైతుల ఆందోళనలు, ఎన్నికల బాండ్లు, ఇజ్రాయిల్-పలస్తీనా పోరుతో పాటు యూనివర్సిటీలో ఎదురయ్యే సమస్యలు తదితర అంశాలపై ప్రసంగించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని విద్యార్థులను కోరారు. తొలుత జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల్లో ఏకైక మహిళా అభ్యర్థి ఆరాధనా యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం సమాజ్‌వాదీ ఛాత్ర సభ నాయకురాలు) మాట్లాడుతూ క్యాంపెస్‌లో భద్రత, మహిళలపై వివక్షతో పాటు అనేక అంశాలను ప్రస్తావించారు. తాను ఎన్నికైతే మైనారిటీ రిజర్వేషన్ కోసం కృషిచేస్తానని, వెనుకబడి ప్రాంతాల విద్యార్థులు ముఖ్యంగా మహిళలకు సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. ఆమె తర్వాత ది యునైటెడ్ లెఫ్ట్ అలయెన్స తరపు అధ్యక్ష అభ్యర్థి ధనరాజ్ మాట్లాడారు. తన ప్రసంగాన్ని లాల్ సలామ్ నినాదంతో మొదలు పెట్టారు. యూనివర్సిటీలు తీసుకునే హయ్యర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజెన్సీ (హెచ్ఈఎఫ్) రుణాల కారణంగా ఫీజులు పెరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. నిరుద్యోగం, విదేశీ వర్సిటీలకు ద్వారాలు తెరవడం వల్ల విద్య వ్యాపారీకరణ తదితర అంశాలను ప్రస్తావించారు. క్యాంపస్‌లో మంచినీరు, ఆరోగ్యం, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. దేశద్రోహం ఆరోపణలతో అరెస్టుకు గురైన విద్యార్థి నాయకుల విడుదలకు డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎస్‌యూఐ అభ్యర్థి జునైద్ రజా, బీఏపీఎస్ఏ అభ్యర్థి విశ్వజిత్ మింజి, ఏబీవీపీ అభ్యర్థి ఉమేశ్ చంద్ర అజ్మీరా కూడా ప్రసంగించారు. అయితే కొందరు నాయకుల ప్రసంగాలను విద్యార్థులు అడ్డుకున్నారు. దీంతో వారి నుంచి డప్పులు తదితర వాయిద్యాలను వర్సిటీ ఎన్నికల కమిటీ స్వాధీనం చేసుకున్నది. జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికలు ఈనెల 22న జరుగనున్నాయి. ఫలితాలు 24వ తేదీన వెలువడతాయి.

ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు ఇచ్చేశాం

సుప్రీంకు తెలిపిన ఎస్‌బీఐ

న్యూదిల్లీ: ఎన్నికల బాండ్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఎస్‌బీఐ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీరియల్ నంబర్లు సహా బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. ఈ మేరకు కోర్టులో ఎస్‌బీఐ గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేశామని, భద్రతా కారణాల దృష్ట్యా బ్యాంకు ఖాతాల నంబర్లు, కేవైసీ వివరాలు బహిర్గతం చేయలేదని పేర్కొంది. ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో జారీ చేసిన బాండ్ల వివరాలను ఈసీకి అందించాలని ఎస్‌బీఐని సుప్రీం ఇంతకుముందు ఆదేశించింది. ఆ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన బ్యాంకు... బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ సంబర్లను మాత్రం బయటపెట్టలేదు. ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే ఈ నంబర్లు లేకపోవడంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బ్యాంకు తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను (నంబర్లతో సహా) ఈసీకి ఇచ్చేశామని చెబుతూ గురువారం సాయంత్రానికి సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ చైర్మన్‌ను ధర్మా సనం ఆదేశించింది. ఈ క్రమంలోనే బ్యాంకు వివరాలు సమర్పించింది.

మీ ఐదేళ్ల లక్ష్యాలేమిటి!

మంత్రిత్వ శాఖలను అడిగిన ప్రధాని మోదీ

న్యూదిల్లీ: వచ్చే ఐదేళ్లలో ఆయా మంత్రిత్వ శాఖలు విధించుకొన్న లక్ష్యాలు ఏమిటో తెలియజేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఓ పత్రం కీలక అధికారులు, మంత్రులకు వెళ్లినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ప్రభుత్వ పత్రం ఒకటి ఆంగ్ల వార్తా సంస్థ చేతికి అందింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ప్రభుత్వంలోని కీలక అధికారులకు ప్రధాని సూచనలు చేస్తూ దీనిని పంపారు. భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యానికి అనుగుణంగా రానున్న ఐదేళ్ల కార్యాచరణను తెలియజేయాలని అన్ని ప్రభుత్వ శాఖలను కోరుతూ మార్చి 11న ప్రధాని కార్యాలయం ఒక పత్రాన్ని పంపింది. వారిచ్చే సమాచారం ఆధారంగా కొత్త ప్రభుత్వం తదుపరి 100 రోజుల ప్రణాళిక ఉంటుందని అందులో పేర్కొన్నారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన, కార్మిక రంగంపై మరింత దృష్టిపెట్టాలని అందులో సూచించారు. ముఖ్యంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలై కొత్త ప్రభుత్వం ఏర్పడేలోపు కాలాన్ని సద్వినియోగం చేసుకొని ఈ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే, ఇందుకు అవసరమైన వివిధ పారిశ్రామిక వర్గాలను కూడా కలుసుకోవాలని సూచించారు. నూరుశాతం పిల్లలు పాఠశాలలకు వెళ్లడం, టీకాలు వేయించుకోవడం వంటి అంశాలను కూడా అందులో ప్రస్తావించారు. గత అక్టోబరులో అధికారులకు వెళ్లిన పత్రంలో కూడా అనేక అంశాలను ప్రస్తావించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధి కోసం కోల్డ్ చైన్ లాజిస్టిక్ వ్యవస్థలు, సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన వసతుల కల్పన, 2030 నాటికి సమష్టి వ్యవసాయం పెంచడంపై ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆ వార్తా సంస్థ పేర్కొంది. వ్యవసాయోత్పత్తిని పెంచడం, వ్యవసాయేతర రంగాల్లోకి ఉద్యోగాలను మళ్లించడం వంటి అంశాలు దీనిలో ఉన్నాయి.

కాంగ్రెస్‌లో చేరిన దానిష్ అలీ

న్యూదిల్లీ: బీఎస్పీ బహిష్కృత నాయకుడు, లోక్‌సభ ఎంపీ దానిష్ అలీ బుధవారం కాంగ్రెస్ కుండువా కప్పుకున్నారు. ఆ పార్టీ సీనియర్ల సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ దేశ పరిస్థితుల దృష్ట్యా విభజన శక్తులపై పోరునకు కాంగ్రెస్‌లో చేరడం ముఖ్యమన్నారు. 'ఓ వైపు విభజన శక్తులు పేట్రేగిపోతుంటే... మరో వైపు పేదలు, అణగారిన వర్గాల కోసం న్యాయ పోరాటం జరుగుతుంది. ఎవరి పక్షాన్న నిలవాలన్నది నిర్ణయించేందుకు ఇదే సమయం' అని దానిష్ అన్నారు. విభజన శక్తులపై పోరాటాన్ని బలోపేతం చేసేందుకు అంతా ఏకం కావాలన్నారు. రాజకీయాల్లో ఎందుకు వచ్చామో ఆ సిద్ధాంతాలకు కట్టుబడాలన్నారు. ఇందుకోసం కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సభ్యుడిగా రాజకీయ భవిష్యత్ ప్రయాణాన్ని సాగిస్తానని దానిష్ అలీ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా సిట్టింగ్ ఎంపీగా ఉన్న దానిష్ అలీ ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ తరపున తాజా ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. కాగా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకుగాను ఆయన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో బహిష్కరణకు గురయ్యారు.

కాపులకు రిజర్వేషన్లు కల్పించాలి

షర్మిలకు ఐక్య కాపునాడు వినతి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో దామాషా ప్రకారం కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్రలో కాపు, తెలగ, బలిజ, ఒంటరికి తగిన స్థానం కల్పించాలని, ఆ దిశగా తమిళనాడు తరహాలో ఆయా కులాలకు రిజర్వేషన్లను ఐదు నుంచి 10 శాతానికి పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు కోరింది. ఈ మేరకు విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకు, ఆ పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావుకు ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కాపు సామాజికవర్గం వాస్తవ సంఖ్యను లెక్కించి, దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ఐక్యకాపునాడు రాష్ట్ర నేత ముత్యాల రమేశ్, పన్నెంరెడ్డి రాధాకృష్ణ, లక్ష్మణరావు ఉన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.